RNI No. APTEL/2009/28868

ప్రజల కోసం... ప్రజల పక్షాన...
నిజం మా నడవడి...

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

PEOPLE ISSUES OUR MISSION

TRUTH BRINGS A BETTER SOCIETY

CITIZEN TIMES TELUGU DAILY

| సంపుటి :18 | సంచిక : 301 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 6-9- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ॥ |
|---|---|---|---|---|---|---|
| VOLUME: 18 | ISSUE : 301 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 6-9-2026 | PAGES: 8 | PRICE : 2/- RS |

# టీచర్ స్థానాన్ని మరో టీచర్ తోనే భర్తీ చేయగలం

- విజయవాడలో నిర్వహించిన కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరు
- సీఎంగా మెగా డీఎస్సీపైనే తొలి సంతకం చేశానని వెల్లడి
- టెక్నాలజీ పెరిగినా గురువు స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని స్పష్టం
- చిన్నప్పుడు టీచర్ చేతిలో దెబ్బలు తిన్న విషయాన్ని గుర్తుచేసుకున్న సీఎం
- తల్లిదండ్రుల తర్వాత విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దేది గురువేనని వ్యాఖ్య

తరువాయి 2లో..



## ఇక రాజకీయాల నుంచి తప్పుకుంటా.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను: అయ్యన్నపాత్రుడు



*రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్టు అయ్యన్న ప్రకటన*

*వయసు పైబడటం వల్ల విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నానని వెల్లడి*

*ఈ మూడేళ్ల కాలంలో తన నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తానన్న అయ్యన్న*

అమరావతి, సిటిజన్ టైమ్స్

ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంచలన ప్రకటన చేశారు. తాను ఇకపై తరువాయి 2లో..




## పెరుగుతున్న నీటి మట్టాలతో నగరానికి ప్రమాదం

### ఐరాస హెచ్చరిక

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

సముద్ర మట్టాల పెరుగుదలతో దక్షిణాసియాలో ముంబయి సహా పలు తీర నగరాల్లో భారీగా ప్రజలు ఇళ్లు కోల్పోయి తరలిపోవాల్సిన పరిస్థితి రావచ్చని ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక హెచ్చరించింది. 2024లో ప్రపంచ సముద్ర మట్టాలు ఏడాదిలోనే 5.9 మి.మీ. పెరిగాయి. 2014-23 మధ్య నమోదైన 4.7 మి.మీ. సగటుతో పోలిస్తే ఇది రికార్డు స్థాయి. కర్బన ఉద్గారాలను గణనీయంగా తగ్గించినా 2100 నాటికి సముద్ర మట్టం కనీసం అర మీటరు పెరగొచ్చని ఐరాస అంచనా. తీవ్ర పరిస్థితుల్లో ఈ పెరుగుదల రెండు మీటర్ల వరకు ఉండొచ్చని తరువాయి 2లో..

## గ్లోబల్ లీడర్లలో మోదీ అత్యంత స్ఫూర్తిదాయకం

బెల్జియం ప్రధాని ప్రశంసల వర్షం

మోదీ తెలివైన నాయకుడన్న బార్ట్ డె వెవర్

మోదీతో భేటీ కావడం తనకు లభించిన గౌరవమని వ్యాఖ్య

విశ్వవేదికపై భారత్ పాత్ర కీలకంగా మారిందన్న బెల్జియం ప్రధాని



న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

ప్రపంచ రాజకీయాల్లో తీవ్ర అస్థిరత, భౌగోళిక తరువాయి 2లో..

## కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. లష్కరే కమాండర్ హతం

బుద్గాం జిల్లా యూస్‌మార్గ్‌లో ఎన్‌కౌంటర్

పాకిస్థాన్‌కు చెందిన లష్కరే కమాండర్ యాసిర్ హతం

నిఘా సమాచారంతో జాయింట్ ఆపరేషన్ చేపట్టిన బలగాలు

కొంతకాలంగా యాసిర్ కదలికలపై భద్రతా సంస్థల నిఘా



న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత ప్రక్రియ కొనసాగుతోంది. శనివారం మధ్య కశ్మీర్‌లోని బుద్గాం జిల్లాలో భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా (ఎల్ఈటీ) కమాండర్ యాసిర్ హతమయ్యాడు. యూస్‌మార్గ్ అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ తరువాయి 2లో..

# 2029 నాటికి మరో మూడు డీఎస్సీలు



మంత్రి నారా లోకేశ్ ప్రకటన

విజయవాడలో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం

హాజరైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

ఏపీలో విద్యావ్యవస్థను దేశంలోనే అగ్రగామిగా నిలపడమే లక్ష్యమని వెల్లడి

వచ్చే ఏడాది ఏప్రిల్ లోపు వర్సిటీల్లో ఫ్యాకల్టీ నియామకాలు పూర్తి

వివాదాస్పద జీవో 117 రద్దు, పారదర్శక బదిలీలతో ఉపాధ్యాయులకు న్యాయం

తరువాయి 2లో..

## పాక్‌కు గట్టి సంకేతం.. సింధు నదిపై భారత్ కొత్త ప్లాన్!

సింధు నదిపై భారత్ తొలి రాక్ చెక్ డ్యామ్

లడఖ్ లోని ఉప్షి వద్ద నిర్మాణం -దాదాపు 10 అడుగులు పెరిగిన నీటి మట్టం

డ్యామ్‌లో 4 కోట్ల లీటర్ల నీటి నిల్వ -ఇగూ ఫే కాలువ ద్వారా పొలాలకు నీరు



న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

లడఖ్‌లో నీటి కొరతతో ఇబ్బంది పడుతున్న రైతులకు భారత్ ఊరటనిచ్చింది. సింధు నదిపై దేశంలోనే తొలి రాక్ చెక్ డ్యామ్‌ను నిర్మించింది. లేహ్‌లోని ఉప్షి వద్ద నిర్మించిన ఈ డ్యామ్ వల్ల నదిలో నీటి మట్టం దాదాపు 10 అడుగులు పెరిగింది. దీంతో వసంతకాలంలో సాగుకు నీరు అందక ఇబ్బంది పడుతున్న గ్రామాల పొలాలకు నీటిని మళ్లించే అవకాశం ఏర్పడింది. ఈ డ్యామ్‌ను సిమెంట్ ఉపయోగించకుండా పూర్తిగా సహజమైన పెద్ద రాళ్లతో నిర్మించారు. ఇందులో దాదాపు 4 కోట్ల లీటర్ల తరువాయి 2లో..

## నేపాల్‌లో విరిగిపడిన కొండచరియలు.. మళ్లీ వరద ముప్పు..



న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

హిమానీనదం (గ్లేసియర్) విరిగిపడి భారీ వరదలతో అతలాకుతలమైన నేపాల్‌ను మరో ముప్పు తరువాయి 2లో..

## విద్యాశాఖలో కీలక మార్పులు.. టీచర్ల సమస్యలపై సీఎం రేవంత్ హామీ

పెండింగ్ టీచర్ల పదోన్నతులు పూర్తి చేశామన్న రేవంత్

బదిలీలపై జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామన్న సీఎం

రెండేళ్లలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ

సాంకేతిక విద్యకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్న రేవంత్

పాలిటెక్నిక్ విధానంలో మార్పులు లేవని స్పష్టీకరణ

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్



విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకొస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులను పూర్తి చేశామని చెప్పారు. టీచర్ల బదిలీల విషయంలోనూ ప్రభుత్వం ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తోందన్నారు. కొడంగల్ తరువాయి 2లో..

## ఎడిటోరియల్

# గోదావరి కాలుష్యం... యాక్షన్ కి పవన్ రెడీ !

ఏపీ కూటమిలో ఉప ముఖ్యమంత్రిగా పవన్ కీలక స్థానంలో ఉన్నారు. అంతే కాదు ఆయన చేతిలో అయిదు ముఖ్య శాఖలు ఉన్నాయి. వాటిలో పర్యావరణం కాలుష్య నియంత్రణ శాఖలు కూడా ఉన్నాయి. దాంతో పవన్ ఈ శాఖల మీద ఎక్కువ ఫోకస్ పెడుతున్నారు. గతంలో ఈ శాఖలకు మంత్రులు ఉన్నా ఇంతలా వీటి గురించి చర్చించుకునేందుకు వీలు అయితే లేదనే అంటున్నారు. కానీ పవన్ కి పర్యావరణం మీద ప్రేమ ఉంది, కాలుష్యాన్ని వీలైనంతగా నియంత్రించాలని పట్టుదల ఉంది. అందుకే ఈ శాఖలు తరచూ వార్తలలోకి వస్తున్నయి. ఇక ప్రత్యేకించి ఈ శాఖల మంత్రిగా పవన్ జిల్లాలలో పర్యటిస్తూ ఎక్కడ ఉల్లంఘనలు జరిగాయో స్వయంగా తనిఖీలు చేసి మరీ ఆయా సంస్థలకు హెచ్చరికలు జారీ చేస్తూ వస్తున్నారు. ఈ మధ్యనే ఆయన రాజమండ్రీలో పర్యటించి మరీ ఆంధ్రా పేపర్ మిల్స్ వల్లనే గోదావరి నదిలో కాలుష్యం అధికం అయింది అన్నది గుర్తించారు. అయితే మొదటి తప్పుగా సంస్థకు హెచ్చరించి పరిష్కార మార్గాలని సూచించినా సంస్థ నుంచి స్పందన రాలేదని అంటున్నారు. దాంతో పవన్ ఇపుడు ఈ సంస్థ మీద చర్యలకు దిగాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లుగా చెబుతున్నారు. రాజమండ్రీ నగరంలో రోజుకు 70 మిలియన్ లీటర్ల ద్రవ్య వ్యర్థాలు విడుదల అవుతూంటే అందులో సగానికి సగం 35 మిలియన్ లీటర్లు ఆంధ్రా పేపర్ మిల్స్ నుంచే వస్తున్నాయని కాలుష్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అంతే కాదు 2016 తరువాత కాతేరు గ్రామ పంచాయతీకి అలాగే రాజమండ్రి కార్పోరేషన్ కి ఒక్క పైసా కూడా పన్ను ఈ సంస్థ చెల్లించలేదని కూడా గుర్తించింది అంటున్నారు. అలా స్థానిక సంస్థలకు 21.34 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందని అధికారుల వద్ద లెక్క ఉంది. పన్నులు చెల్లించాలని నోటీసులు ఇచ్చిన ప్రతీ సారీ కోర్టుని ఆశ్రయిస్తూ కాలయాపన చేస్తున్నారు అని కూడా కాలుష్య మంత్రిత్వ శాఖ చెబుతోంది. సదరు సంస్థ నుంచి గోదావరిలోకి నేరుగా కలుస్తున్న ద్రవ వ్యర్థాల కారణంగా నీటిలో కాలుష్యం పేరుకుని పోయి ఆక్సిజన్ శాతం గణనీయంగా తగ్గిపోయింది అని కూడా నివేదికలు వెల్లడిస్తున్నాయి. దాంతో జల చరాలు నదిలో మనుగడకు ఇబ్బందికరంగా ఈ పరిస్థితులు మారుతున్నాయని అంటున్నారు. ఇక దుర్గంధంతో పాటు గోదావరి నీటిలో నాణ్యతా ప్రమాణాలు పడిపోయి నగర ప్రజల ఆరోగ్యం జీవన ప్రమాణాల మీద అధికంగా ప్రభావం చూపిస్తోంది అని నివేదిక వెల్లడిస్తోంది. ఈ పరిస్థితుల్లో మూడు నెలల క్రితం క్షేత్ర స్థాయి పర్యటన చేపట్టి హెచ్చరించినా సదరు సంస్థలో మార్పు లేదని అధికారులు పలు మార్లు సూచనలు చేసినా పాటించలేదని ఉప ముఖ్యమంత్రి పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారని అంటున్నారు. ఇక ఉపేక్షించేది లేదని తక్షణం ఆ సంస్థకు సమన్లు జారీ చేసి చర్యలకు ఉపక్రమించాలని పవన్ సంబంధింత అధికారులకు ఆదేశాలు జారీ చేశారని అంటున్నారు. ఇక న్యాయపరంగా కూడా ప్రభుత్వం నుంచి అడ్వకేట్ జనరల్ అదనపు అడ్వకేట్ జనరల్ స్టాండింగ్ కౌన్సిల్ కి ఈ కాలుష్య ఉల్లంఘన కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని పవన్ ఆదేశించారు. ఇక వచ్చే ఏడాది 2027 జూలైలో జరిగే గోదావరి పుష్కరాల నాటికి నదిని పవిత్రంగా కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పౌర సమాజంతో పాటు పర్యావరణవేత్తల నుంచి మద్దతు ఇవ్వాలని పవన్ కోరడం విశేషం. ప్రజా ప్రయోజనాలతో పాటు పర్యావరణ హితానికి అత్యధిక ప్రాధాన్యత కూటమి ప్రభుత్వం ఇస్తుందని పవన్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని కూడా తేల్చి చెప్పారు.

## పాక్‌కు గట్టి సంకేతం.. సింధు నదిపై భారత్ కొత్త ప్లాన్!

నీటిని నిల్వ చేయవచ్చు. ఈ నీటిని ఇగూ ఫే సాగునీటి కాలువ ద్వారా పొలాలకు అందిస్తున్నారు. ఇప్పటివరకు లడఖ్‌లోని పలు ప్రాంతాల్లో సింధు నది లోతైన లోయల మధ్య తక్కువ స్థాయిలో ప్రవహించేది. దీంతో వసంతకాలంలో పంపుల ద్వారా నీటిని తీసుకోవడం రైతులకు సాధ్యమయ్యేది కాదు. ఫలితంగా సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉప్షి వద్ద నిర్మించిన చెక్ డ్యామ్ స్థానిక వ్యవసాయానికి ఉపయోగపడటంతో పాటు వ్యూహాత్మకంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది. సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన పరిస్థితుల్లో సరిహద్దు ప్రాంతాల్లో నదీ జలాలను వినియోగించుకునేందుకు మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామనే సంకేతాన్ని ఈ ప్రాజెక్టు ఇస్తోంది. లడఖ్ పాలన యంత్రాంగం ఇలాంటి మరిన్ని చెక్ డ్యామ్‌ల నిర్మాణంపై దృష్టి పెట్టింది. ఇందుకోసం కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖకు 36 ప్రాజెక్టులతో ప్రతిపాదన పంపింది. ఇందులో లేహ్ ప్రాంతంలో 7 హిమాలయన్ రాక్ చెక్ డ్యామ్‌లు, కార్గిల్‌లో 29 చెక్ డ్యామ్‌లు ఉన్నాయి. వీటి అంచనా వ్యయం రూ. 56 కోట్లకు పైగానే ఉంది.

# సముద్రం మింగేస్తుందా..!

పేర్కొంది.

**2050పై అప్పుడే హెచ్చరిక**

ముంబయి క్లైమేట్ యాక్షన్ ప్లాన్‌లోనూ సముద్ర మట్టాల పెరుగుదలపై హెచ్చరికలు ఉన్నాయి. 2050 నాటికి ఐలాండ్ సిటీలో 80 శాతం ప్రాంతం ముంపునకు గురయ్యే అవకాశం ఉందని అప్పటి అంచనాల్లో పేర్కొన్నారు. ముంబయి మొత్తం ఆ తేదీకి నీటిలో మునిగిపోతుందని కాదు.. ముంపు, తీర వరదల తీవ్రత గణనీయంగా పెరిగే ప్రమాదాన్ని సూచిస్తుంది.

**ఇళ్లే కాదు.. నీరూ మునుగుతుందా?**

సముద్రపు ఉప్పునీరు భూగర్భ జలాల్లోకి చొచ్చుకుపోతే తీర ప్రాంతాల్లో తాగునీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. వరదలు పెరిగితే రహదారులు, రైళ్లు, పారిశుద్ధ్య వ్యవస్థలు, ఇళ్లు, ఇతర మౌలిక వసతులపై తీవ్ర ప్రభావం పడొచ్చు. అందుకే ముంబయిలో తీర రక్షణ, వరద నియంత్రణ, మౌలిక వసతుల బలోపేతంపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు.

**వర్షం.. వరద.. సముద్రం!**

నగరంలో వర్షాల తీవ్రత కూడా పెరుగుతోంది. అత్యంత భారీ వర్షాల సమయంలో నమోదయ్యే సగటు వర్షపాతం ఆరేళ్లలో 132 మి.మీ. నుంచి 182 మి.మీ.కి పెరిగింది. గత పదేళ్లలో నాలుగు గంటలు లేదా అంతకంటే ఎక్కువసేపు కొనసాగే అతిభారీ వర్షాలు 28 సార్లు నమోదయ్యాయి. భారీ వర్షానికి అధిక అలలు తోడైతే తీర ప్రాంతాలు మరింత వేగంగా ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది.

**మూడు వైపులా సముద్రమే..**

ముంబయి భౌగోళిక స్వరూపమే ఇప్పుడు ప్రధాన ఆందోళనగా మారింది. మూడు వైపులా అరేబియా సముద్రం ఉండటంతో సముద్ర మట్టాల పెరుగుదల ప్రభావం నగరంపై నేరుగా పడే అవకాశం ఉంది. భూమి కుంగిపోవడం, ఉప్పునీరు భూగర్భ జలాల్లోకి చొచ్చుకురావడం ముప్పును మరింత పెంచుతున్నాయి.

# టీచర్ స్థానాన్ని మరో టీచర్ తోనే భర్తీ చేయగలం

విజయవాడ

రాష్ట్ర అభివృద్ధికి ఉపాధ్యాయ నియామకాలు అత్యంత కీలకమని, అందుకే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీ ఫైలుపై తొలి సంతకం చేశానని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విజయవాడలో శనివారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏళ్ల తరబడి సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు న్యాయం చేసేందుకు, న్యాయపరమైన చిక్కులను అధిగమించి మెగా డీఎస్సీని నిర్వహించి ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. ఈ సందర్భంగా తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, భక్తవత్సలం అనే గురువు చేతిలో తాను దెబ్బలు తిన్నానని చెప్పారు. అయితే, గురువుల వల్లే తాను ఈ స్థాయికి వచ్చానని అన్నారు. భారతీయ సంస్కృతిలో “మాతృదేవో భవ, పితృదేవో భవ” తర్వాత “ఆచార్య దేవో భవ” అని గురువుకే అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. విద్యార్థులు ఎక్కువ సమయం పాఠశాలలోనే గడుపుతారని, వారిలో దాగి ఉన్న శాస్త్రవేత్తలను, క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సూచించారు. టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రూపంలో ఎన్ని మార్పులు వచ్చినా, ఒక ఉపాధ్యాయుడి స్థానాన్ని మరో ఉపాధ్యాయుడు మాత్రమే భర్తీ చేయగలరని చంద్రబాబు అన్నారు. విద్యార్థులు కేవలం పుస్తకాల్లోని పాఠాలే కాకుండా, బయటి ప్రపంచం గురించి కూడా నేర్చుకోవాలని, ఈ విషయంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని వివరించారు. గతంలో తాను సీఎంగా ఉన్నప్పుడు ఐటీ విప్లవానికి శ్రీకారం చుట్టానని, టెలికాం రంగంలో అప్పటి ప్రధాని వాజ్‌పేయి సహకారంతో కీలక సంస్కరణలు తీసుకొచ్చామని గుర్తుచేశారు. దాని ఫలితంగానే హైదరాబాద్ నాలెడ్జ్ ఎకానమీ హబ్‌గా మారిందని, ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు సత్తా చాటుతున్నారని అన్నారు. అమెరికా, ఆసియా దేశాల అభివృద్ధికి జ్ఞానమే పునాది అని, రాబోయే 10-15 ఏళ్లలో భారత్ స్వరూపం పూర్తిగా మారిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఒకప్పుడు సిద్ధాంతాలకు ప్రాధాన్యం ఉండగా, ఇప్పుడు పోటీతత్వం పెరిగి విలువలు తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# 2029 నాటికి మరో మూడు డీఎస్సీలు

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లో విద్యావ్యవస్థను దేశంలోనే అగ్రగామిగా నిలపడమే లక్ష్యమని, అందుకోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 2029లోగా మరో మూడు మెగా డీఎస్సీలు నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేస్తామని ఆయన కీలక ప్రకటన చేశారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో శనివారం జరిగిన ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మెగా డీఎస్సీ ఫైలుపైనే తొలి సంతకం చేశారని, ఇచ్చిన మాటకు కట్టుబడి 16,000 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టామని తెలిపారు. “సీబీఎన్ అంటే డీఎస్సీ, డీఎస్సీ అంటే సీబీఎన్” అని అభివర్ణించిన లోకేశ్, చంద్రబాబు నాయకత్వంలో గతంలో 14 డీఎస్సీల ద్వారా సుమారు రెండు లక్షల మంది ఉపాధ్యాయులను నియమించిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. పని చేసేవాళ్లకే రాళ్ల దెబ్బలు తగులుతాయని, ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వారు తనపై విమర్శలు చేస్తున్నా పట్టించుకోనని అన్నారు. “ఓటమిని అంగీకరించడం అనేది నా డిక్షనరీలో లేదు. చిన్న చిన్న స్పీడ్ బ్రేకర్లు వస్తుంటాయి. కానీ నా లక్ష్యం ఒక్కటే.. అంగన్‌వాడీ నుంచి పీజీ వరకు ‘ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్’ను ప్రపంచంలోనే నెంబర్ వన్ చేయడం” అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ఖాళీగా ఉన్న యూనివర్సిటీ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీపైనా మంత్రి కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేసి, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు కొత్త జవసత్వాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

**గత ప్రభుత్వానికి, ప్రజా ప్రభుత్వానికి తేడా ఇదే..**

గత ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద జీవో 117 కారణంగా సుమారు 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వీడి ప్రైవేటుకు వెళ్లారని లోకేశ్ ఆరోపించారు. తమ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ జీవోను రద్దు చేసిందని, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాప్రతినిధులతో చర్చించి ‘మోడల్ ప్రైమరీ స్కూల్’ వ్యవస్థను తీసుకొచ్చామని వివరించారు. దీని ఫలితంగా ఈ ఏడాది ఏకంగా 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరారని, ఈ ఘనత పూర్తిగా ఉపాధ్యాయులదేనని ప్రశంసించారు. ఉపాధ్యాయుల సర్వీస్ విషయాల్లో పారదర్శకత కోసం ‘లీప్ యాప్’ను తీసుకొచ్చామని, బదిలీల ప్రక్రియను కూడా పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు.

**ప్రతి విద్యార్థి ప్రాణం విలువైందే..**

ఈ సందర్భంగా ఇటీవల జరిగిన ఓ విషాదకర ఘటనను ప్రస్తావిస్తూ లోకేశ్ భావోద్వేగానికి గురయ్యారు. పేరెంట్-టీచర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి పక్కన కూర్చుని మాట్లాడిన ఓ విద్యార్థిని రెండు రోజులకే ఆత్మహత్య చేసుకోవడం తనను, ముఖ్యమంత్రిని తీవ్రంగా కలచివేసిందని అన్నారు. “ప్రతి బిడ్డ ముఖ్యమే, ప్రతి ప్రాణం విలువైందే (ఎవ్రీ చైల్డ్ మ్యాటర్స్, ఎవ్రీ లైఫ్ మ్యాటర్స్). పిల్లల్లో ఏ చిన్న మార్పు కనిపించినా ఉపాధ్యాయులు గమనించాలి. వారిలో మానసిక స్థైర్యాన్ని, ఒత్తిడిని తట్టుకునే శక్తిని పెంచాల్సిన బాధ్యత మనందరిపై ఉంది” అని పిలుపునిచ్చారు. ఇందుకోసం త్వరలోనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తామని తెలిపారు. ఫెయిల్ అంటే ‘ఫస్ట్ అటెంప్ట్ ఇన్ లెర్నింగ్’ అని పిల్లలకు నేర్పించాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యారంగంపై చూపిస్తున్న శ్రద్ధను వివరిస్తూ, మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి, నాణ్యత పెంచాలని ఆదేశించారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితోనే నాణ్యమైన బియ్యాన్ని అందిస్తున్నామన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం, సావిత్రిబాయి పూలే వంటి మహనీయులను ఉదాహరణగా చూపుతూ, ఒక ఉపాధ్యాయుడు తలచుకుంటే అద్భుతాలు సృష్టించగలడని, విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దగలడని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సింగపూర్, ఫిన్లాండ్ వంటి దేశాలకు విద్యా పర్యటనలకు పంపి, అక్కడి ఉత్తమ విధానాలను ఇక్కడ అమలు చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.

# విద్యాశాఖలో కీలక మార్పులు.. టీచర్ల సమస్యలపై సీఎం రేవంత్ హామీ

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. తల్లిదండ్రులతో సమానంగా పిల్లల భవిష్యత్తుకు పునాది వేసేది ఉపాధ్యాయులేనని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్ల సమయం ఇస్తే సమస్యలను పరిష్కరించి చూపిస్తానన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం చెప్పారు. సాంకేతిక విద్యకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యావిధానంలో ఎలాంటి మార్పులు చేయడం లేదని స్పష్టం చేశారు. విద్యాశాఖ కమిషన్ ద్వారా అనేక సమస్యలను పరిష్కరిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీఆర్సీ సమస్యను పరిష్కరించామని చెప్పారు. ఇటీవల ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేయడం తనకు చాలా బాధ కలిగించిందన్నారు. కార్యక్రమానికి ముందు కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.

## మొదటి పేజీ తరువాయి

## ఇక రాజకీయాల నుంచి తప్పుకుంటా.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను: అయ్యన్నపాత్రుడు

రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని స్పష్టం చేశారు. నర్సీపట్నంలో జరిగిన తన జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వయసు పైబడటం వల్ల విశ్రాంతి తీసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపిన అయ్యన్న, అసెంబ్లీ స్పీకర్‌గా తనకు మిగిలి ఉన్న మూడేళ్ల పదవీకాలంలో నియోజకవర్గంలో పనులు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడానికి ప్రాధాన్యమిస్తానని ప్రకటించారు. గత 31 ఏళ్లుగా తన పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామన్నారు. మరోవైపు, రేపు (సెప్టెంబరు 6) నర్సీపట్నంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో ‘బీసీ ఐక్య వేదిక సదస్సు’ నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించి విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇస్తుంటే, వైసీపీ మాత్రం బీసీల హక్కులపై రాజకీయం చేస్తూ కుట్రలు పన్నుతోందని టీడీపీ నేతలు మండిపడ్డారు. వైసీపీ కుట్రలను తిప్పికొట్టేందుకు బీసీ వర్గాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

## కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. లష్కరే కమాండర్ హతం

చోటుచేసుకుంది. యూస్‌మార్గ్ ప్రాంతంలో ఉగ్రవాదుల సంచారంపై నిఘా వర్గాల నుంచి అందిన కచ్చితమైన సమాచారంతో స్పెషల్ ఫోర్సెస్, 53 రాష్ట్రీయ రైఫిల్స్ దళాలు సంయుక్తంగా ‘కార్డన్ అండ్ సెర్చ్’ ఆపరేషన్ ప్రారంభించాయి. భద్రతా బలగాల రాకను గమనించిన ఉగ్రవాదులు కాల్పులకు తెగబడటంతో దళాలు ప్రతిదాడి చేశాయి. ఈ కాల్పుల్లో యాసిర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. యాసిర్ గతంలో లష్కరే తోయిబాలోని సులేమాన్ మూసా గ్రూప్‌లో సభ్యుడిగా ఉండేవాడని, అయితే సుమారు ఏడాది క్రితం ఆ విభాగం నుంచి విడిపోయి సొంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి. గత కొంతకాలంగా యూస్‌మార్గ్ పరిసర ప్రాంతాల్లో అతడి కదలికలపై నిఘా ఉంచినట్లు అధికారులు తెలిపారు. యాసిర్ మృతి నేపథ్యంలో అతడి నెట్‌వర్క్, లష్కరే సభ్యులతో ఉన్న సంబంధాలు, అలాగే ఇటీవల జమ్ము కశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడుల్లో అతడి ప్రమేయంపై దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయి. కాగా, 2025 పహల్గాం ఉగ్రదాడికి సూత్రధారి అయిన సులేమాన్ మూసాను గతంలోనే భద్రతా బలగాలు హతమార్చిన సంగతి తెలిసిందే. కశ్మీర్‌లో ఉగ్రవాద నిర్మూలనకు చేపట్టిన ఆపరేషన్లలో యాసిర్ ఎన్‌కౌంటర్ కీలక విజయమని అధికారులు పేర్కొన్నారు.

## గ్లోబల్ లీడర్లలో మోదీ అత్యంత స్ఫూర్తిదాయకం

ఉద్రిక్తతలు నెలకొన్న ప్రస్తుత తరుణంలో భారత ప్రధాని మోదీ అనుసరిస్తున్న దౌత్య విధానాలు, నాయకత్వ పటిమపై బెల్జియం ప్రధాని బార్ట్ డె వెవర్ ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలోని అత్యంత స్ఫూర్తిదాయకమైన, తెలివైన నేతల్లో మోదీ అగ్రగామి అని అభివర్ణించిన ఆయన... మోదీతో భేటీ కావడం తనకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచంలోని పలువురు అగ్రనేతల ప్రసంగాలు విన్నప్పుడు ఆందోళన, అభద్రతా భావం కలుగుతాయని... కానీ ప్రధాని మోదీ మాట్లాడితే ఆయన చెప్పిన దార్శనికతను అనుసరించాలనే నమ్మకం, స్ఫూర్తి కలుగుతాయని వ్యాఖ్యానించారు. విశ్వవేదికపై భారత్ పాత్ర అత్యంత కీలకంగా మారిందని కొనియాడిన బెల్జియం ప్రధాని... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను బెల్జియం ఒక విశ్వసనీయ భాగస్వామిగా చూస్తోందని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇదే సమయంలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలు, టారిఫ్‌లపై ఆయన పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఏ క్షణాన ఏ నిర్ణయం తీసుకుంటారో తెలియని అస్థిరత వల్ల ప్రపంచ వాణిజ్యమే ప్రమాదంలో పడుతుందని... స్వేచ్ఛా వాణిజ్యం, బలమైన ద్వైపాక్షిక భాగస్వామ్యాల ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

## నేపాల్‌లో విరిగిపడిన కొండచరియలు.. మళ్లీ వరద ముప్పు..

వెంటాడుతోంది. తాజాగా జారీచేసిన వరద ప్రమాద హెచ్చరికలు ఆ దేశాన్ని తీవ్రంగా భయపెడుతున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో దార్చులా జిల్లాలోని భట్టార్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి చౌలానీ నది ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. కొండలపై నుంచి జారిపడిన రాళ్లు, మట్టితో నదీ ప్రవాహం పాక్షికంగా నిలిచిపోయింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రాళ్లు తొలగిపోతే ఒక్కసారిగా దిగువ ప్రాంతాలను వరద ముంచెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ క్రమంలోనే నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం సూచించింది. పరిస్థితిని పర్యవేక్షించేందుకు పోలీసులను రంగంలోకి దించింది. సహాయక చర్యల కోసం అత్యవసర ఫోన్ నంబర్లనూ విడుదల చేసింది. వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాలు ఇంకా కోలుకోకముందే.. ఈ కొత్త ముప్పు పొంచి ఉండటం ఆందోళనకరంగా మారింది.

# సామాజిక సేవకు రాష్ట్రస్థాయి గుర్తింపు..

# లెంక సురేష్‌కు ప్రతిష్ఠాత్మక పురస్కారం

### రాజ్ న్యూస్ ఎక్సలెన్స్ అవార్డ్స్--2026లో రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారం

### మంత్రి కందుల దుర్గేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ చేతుల మీదుగా అవార్డు స్వీకరణ



**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న ఆనందపురం మండలం మిందివానిపాలెం గ్రామానికి చెందిన లెంక సురేష్‌కు రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారం లభించింది. రాజ్ న్యూస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్ న్యూస్ ఎక్సలెన్స్ అవార్డ్స్--2026 కార్యక్రమంలో ఆయనను రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపిక చేశారు. విజయవాడలో ఘనంగా నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ చేతుల మీదుగా లెంక సురేష్ ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు సురేష్‌ను అభినందించారు. చిన్ననాటి నుంచే సామాజిక సేవ పట్ల ఆసక్తి కనబరుస్తూ లెంక సురేష్ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నిరుపేదలకు ఉచిత ఆహార పంపిణీ, రక్తదాన శిబిరాల నిర్వహణతో పాటు అవసరమైన వారికి తనవంతు సహాయం అందిస్తూ సామాజిక సేవలో ముందుకు సాగుతున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం తన స్నేహితులతో కలిసి విద్యారంగంలో కూడా సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పాఠశాలను స్థాపించి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందుబాటు ఖర్చుతో నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. ముఖ్యంగా అనాథ, నిరుపేద విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు చేస్తున్న కృషిని గుర్తించిన రాజ్ న్యూస్ నిర్వాహకులు సురేష్‌ను ఈ రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లెంక సురేష్ మాట్లాడుతూ తన సేవా ప్రయాణానికి లభించిన గొప్ప గుర్తింపుగా ఈ పురస్కారాన్ని భావిస్తున్నానని తెలిపారు. తన కృషికి ప్రతిఫలంగా రాష్ట్రస్థాయిలో అవార్డు అందుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా మరింత ఉత్సాహంతో సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని పేర్కొన్నారు. తన ప్రయాణంలో సహాయ సహకారాలు అందించిన జర్నలిస్టులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక సేవతో పాటు విద్యారంగంలో చేస్తున్న సేవలకు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించడం పట్ల మిందివానిపాలెం గ్రామ ప్రజలు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ లెంక సురేష్‌కు అభినందనలు తెలిపారు.

## సహకార సేవల్లో సరికొత్త అధ్యాయం.. ఆనందపురం డీసీసీబీకి తొలి వార్షికోత్సవం

### డిపాజిటర్లు, రుణగ్రహీతలకు ఘన సన్మానం




**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05:**

మండల కేంద్రంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఆనందపురం శాఖ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి డీవీఎస్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంకు అభివృద్ధికి విశేషంగా సహకరించిన డిపాజిటర్లు, రుణగ్రహీతలకు బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం విశాఖపట్నం జిల్లా సహకార యూనియన్ ప్రతినిధులు, వివిధ పీఏసీఎస్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు డీసీసీబీ సీఈఓ డీవీఎస్ వర్మను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా డీవీఎస్ వర్మ మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లా సహకార రంగం పనితీరులో రాష్ట్రస్థాయిలోనూ అగ్రగామిగా నిలుస్తోందన్నారు. రైతులు, సహకార సంఘాల ప్రతినిధులు, సిబ్బంది సమష్టి కృషితో ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నారు. రుణాల వసూళ్లు, డిపాజిట్ల సమీకరణ, బంగారు రుణాల మంజూరులో జిల్లా విశేష ప్రగతి సాధిస్తోందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు జీఎం బి. శ్రీనివాసరావు, డీజీఎం ఎం. అశోక్‌కుమార్, ఏజీఎంలు ఎంవీవీ కిషోర్, ఎల్‌కేఎం నాయుడు, రామకృష్ణ, చీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్, ఆనందపురం శాఖ మేనేజర్ నాగలక్ష్మి, సూపర్‌వైజర్ పి. శ్రీనివాస్, క్యాషియర్ సంతోషి, పద్మనాభం శాఖ మేనేజర్ అప్పారావుతో పాటు పలువురు సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మజ్జి శ్రీనివాసరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వైసీపీ నేతలు




**భీమిలి సిటిజెన్ టైమ్స్ సెప్టెంబర్ 05:**

విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పుట్టినరోజు సందర్భంగా వైసీపీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం తన నివాసంలో వైఎస్ఆర్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ, విశాఖపట్నం జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు బోని శివరామకృష్ణ, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు కంట్రీ రెడ్డి రామన్న పాత్రుడు తదితరులు చిన్న శ్రీనును కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రజల వద్దకే కాంగ్రెస్.. వార్డుల్లో సమస్యల అన్వేషణ

### స్థానిక ఎన్నికలకు వార్డు మేనిఫెస్టో విడుదల చేస్తాం



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి ఆధ్వర్యంలో పీసీసీ, డీసీసీ ప్రతినిధులతో కూడిన ఐదుగురు సభ్యుల కమిటీ నియోజకవర్గంలోని పలు వార్డుల్లో విస్తృతంగా పర్యటించింది. కమిటీ సభ్యులు మహేష్, సునంద దేవి, రజియా బేగం, సుధాకర్, ఆలీ కలిసి 15, 21, 28 వార్డుల్లో పర్యటించి స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వార్డుల వారీగా ప్రజా సమస్యలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలు, ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేకంగా వార్డు మేనిఫెస్టోను రూపొందించి విడుదల చేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు వేమూరి సురేష్, గుర్రం కనకరావు, ఈగల మోహన్ సాయి, పార్టీ కార్యకర్తలు, నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఇస్కాన్ టెంపుల్‌కు వెళ్తానని వెళ్లిన యువకుడు..

# గంభీరం రిజర్వాయర్‌లో మృతదేహం

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఆనందపురం పోలీసులు



**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05:**

ఇస్కాన్ టెంపుల్‌కు వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయలుదేరిన ఓ యువకుడు గంభీరం రిజర్వాయర్‌లో మృతిచెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. విజయవాడకు చెందిన శ్రీరామినేని సందీప్ (30) ప్రస్తుతం విశాఖపట్నంలోని మద్దిలపాలెం పిఠాపురం కాలనీలో నివాసం ఉంటున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సెప్టెంబర్ 4వ తేదీ ఉదయం సందీప్ తన స్నేహితులతో కలిసి ఇస్కాన్ టెంపుల్‌కు వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. అయితే అనంతరం ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. పలుమార్లు ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా ఫోన్ స్విచ్‌ఆఫ్‌లో ఉండటంతో కుటుంబ సభ్యుల్లో మరింత కలవరానికి గురయ్యారు. ఇదిలా ఉండగా గంభీరం రిజర్వాయర్‌లో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు ఆనందపురం పోలీసులకు సమాచారం అందింది. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. అందుబాటులో ఉన్న వివరాల ఆధారంగా మృతుడు శ్రీరామినేని సందీప్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి శ్రీరామినేని అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని గంభీరం రిజర్వాయర్ నుంచి భీమిలి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. అక్కడ పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై ఆనందపురం సీఐ ఎర్రం నాయుడు పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ వెంకటరావు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## తగ్గిన వర్షాలు, సూర్య భగవానుడి భగ భగ మంటలు



**సిటిజన్ టైమ్స్, ధర్మపురి, సెప్టెంబర్ 5**

వర్ష కాలం గత 3నెలలు పడి పడిపడనట్లు కొట్టిన గని, బావులు కుంటలు చెరువులు నిండి నప్పటి కి ప్రజల్లో ఏదో అసంతృప్తి గానే ఉంది. కారణం పంటలు సరిగా వెయ్యక పోవడం. కాలం ఏనాక బడి పోవడం.యిందుకు కారణం. ఈ కారణం గా ప్రజలు వరి పంటలు ఎక్కువ మోతాదులో వెయ్యలేదు అని చెప్పవచ్చు.వర్షాలు పడకపోతే పంటలు పండకపోతే రేట్లు పెరిగాయి అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నిన్న మొన్న. మబ్బులు.వర్షాలు పడినప్పటి కి నేడు ఎండ లు బాగా నే కొడతాయ్ అని ప్రజలు భావిస్తున్నారు.

## వినియోగదారులకు మరింత సేవలు అందించాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ అనిల్ కుమార్

**సిటిజన్ టైమ్స్ మహబూబాబాద్, సెప్టెంబర్ 5 :**

మహబూబాబాద్ జిల్లాలోని వినియోగదారులకు మరింత సేవలు అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అనిల్ కుమార్ సూచించారు. ఐడిఓసిలో జిల్లా వినియోగదారుల సేవా కేంద్రాన్ని వినియోగదారుల సేవా కేంద్రం చైర్మన్ వింజమూరి సుధాకర్ అధ్యక్షతన రిబ్బన్ కట్ చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వినియోగదారులకు జరుగుతున్న మోసాలు, అన్యాయాలు పై న్యాయం కోరుతూ తమ ఫిర్యాదులను ఈ సేవా కేంద్రానికి అందించి వినియోగదారులు సేవలు అందుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డి సి ఎస్ ఓ రమేష్ నాయక్, సివిల్ సప్లైయి డిఎం నర్సింగరావు, మైసా శ్రీనివాస్, జానీ, కల్లూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## కొనసాగనున్న స్పెషల్ క్యాంపెయిన్

## పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో బీఎల్వోలు - జిల్లా కలెక్టర్



**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్, సెప్టెంబరు 05:**

విశాఖపట్నం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో 05వ తేదీ శనివారం, 06వ తేదీ ఆదివారం స్పెషల్ క్యాంపెయిన్లు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. ఈ రెండు రోజులలో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సంబంధిత బీఎల్వోలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వారి వద్ద ఎస్.ఐ.ఆర్.-2026 ముసాయిదా ఓటర్ల జాబితా అందుబాటులో ఉంటుందని, ఓటర్లు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకోవచ్చన్నారు. అర్హత ఉన్నప్పటికీ ముసాయిదా జాబితాలో పేరు లేని వారు, 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న యువ ఓటర్లు, అలాగే వివరాల్లో మార్పులు అవసరమైన వారు ఈ ప్రత్యేక ప్రచార దినాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొత్తగా ఓటరుగా నమోదు కావడానికి ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ముసాయిదా జాబితాలో పేరు, చిరునామా లేదా ఇతర వివరాల్లో సవరణలు చేయించుకోవడానికి, అలాగే నివాసం మారిన సందర్భంలో ఓటరు వివరాలను కొత్త చిరునామాకు మార్చుకోవడానికి ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూలై 31, 2026న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించిన నాటి నుంచి ఇప్పటి వరకు కొత్త ఓటరు నమోదుకు ఫారం-6 ద్వారా 9,172 మంది దరఖాస్తు చేసుకున్నారని, సవరణలు, చిరునామా మార్పు కోసం ఫారం--8 ద్వారా 7,031 మంది దరఖాస్తు చేసుకున్నారని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈఆర్వోలు, ఏఈఆర్వోలు పోలింగ్ స్టేషన్లను సందర్శించి స్పెషల్ క్యాంపెయిన్లను పర్యవేక్షించాలని సూచించారు.. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటర్ల జాబితాలో తన పేరు, వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని శనివారం ఓ ప్రకటన ద్వారా కోరారు.

## ఉపాధ్యాయులే భావితరాలకు మార్గదర్శకులు: సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్



**శేరిలింగంపల్లి, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

ఉపాధ్యాయులే భావితరాలకు మార్గదర్శకులని సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులను సన్మానించిన ఆయన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు రెహానా బేగం, మునీర్ అహ్మద్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా ఎదగడమే ఉపాధ్యాయులకు ఇచ్చే గొప్ప బహుమతి అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖిలో ట్రాఫిక్ నిబంధనలు, మహిళల భద్రత, డ్రగ్స్ నిరోధం, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ.. ఓటీపీలు మరియు బ్యాంకు వివరాలను అపరిచితులకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, మాదాపూర్ ఏసీపీ శ్రీధర్, రాయదుర్గం ఎస్‌హెచ్‌ఓ భూపతి తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయండి

### - ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ప్రతిమలు వద్దే వద్దు - రసాయనాలు భారలోహాలతో కొట్టిన రంగులు వాడవద్దు

### - రసాయనాలతో కూడిన పసుపు కుంకుమలు వినియోగించవద్దు

### - 21 పత్రి మొక్కల వనాలు పెంచుదాం - జె వి రత్నం వ్యవస్థాపక కార్యదర్శి గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05:**
మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయండి, వాటిని పూజించండి అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాప కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. శనివారం ఉదయం మద్దిలపాలెం లోని శ్రీ భావన విద్యా నికేతన్ లో ప్రిన్సిపాల్ శ్యామ్ కుమార్, నీలిమ ల అధ్యక్షతన విద్యార్థుల చేత మట్టి వినాయక ప్రతిమలు తయారు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారుచేసిన ప్రతిమలు వద్దే వద్దు అన్నారు. మన సాంప్రదాయం ప్రకారం మట్టి, పసుపు, బియ్యం పిండితో మాత్రమే ప్రతిమలు తయారు చేయాలని కోరారు. రసాయనాలు భార లోహాలతో కూడిన రంగులు వాడవద్దు అని హెచ్చరించారు. వాటి వల్ల మన ఆహార చక్రం పాడవుతుందన్నారు. జీవావరణానికి ముప్పు ఏర్పడుతుందని వివరించారు. రసాయనాలతో కూడిన పసుపు కుంకుమలు వినియోగించ వద్దన్నారు. వినాయక వ్రతానికి సంబంధించి వినియోగించే పత్రి లోని 21 రకాల మొక్కలు కూడా ఔషధ గుణాలు కలిగినవే కాబట్టి ప్రతి గ్రామంలో , వీధిలో, వినాయక ఆలయాల వద్దా పత్రికి సంబంధించిన మొక్కలు నాటి పెంచాలని కోరారు. పత్రి విత్తనాలతో వినాయక ప్రతిమలు తయారు చేయడం చాలా మంచి అంశం అని పేర్కొన్నారు. గణేష్ పత్రిక సంబంధించిన మాచిపత్రి, బృహతీ పత్రం (వాకుడు) , బిల్వ పత్రం(మారేడు) దూర్వా పత్రం (గరిక) దత్తూర పత్రం (ఉమ్మెత్త) బదరీ పత్రం (రేగు) అపామార్గ పత్రం (ఉత్తరేణి) తులసీ పత్రం (తులసి) చూత పత్రం (మామిడి) కరవీర పత్రం (గన్నేరు) విష్ణుక్రాంత పత్రం, మాచిపత్రి , దాడిమీ పత్రం (దానిమ్మ) దేవదారు పత్రం, మరువక పత్రం, సింధువార పత్రం(వావిలి) జాజీ పత్రం, శమీ పత్రం(జమ్మి) అశ్వత్థ పత్రం(రావి)అర్జున పత్రం(తెల్లమద్ది) అర్క పత్రం(జిల్లేడు)గండలీ పత్రం(దేవకాంచనం) పత్రులనూ ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ సమన్వయకర్త జె రాజేశ్వరి, ఏక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ కృష్ణ కుమారి తదితరులు పాల్గొని మాట్లాడారు.

## జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షునికి పలువురు పరామర్శ



**అమలాపురం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 5**
జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గోదావరి జిల్లాల సిటిజన్ టైమ్స్ బ్యూరో ఇన్చార్జి పెంట నాగ శ్రీనివాస్ ను పలువురు పరామర్శించారు. అయినవిల్లి మండలం కొండుకుదురు గ్రామపంచాయతీ పరిధిలోని కొండుకుదురు లంక ఆయన స్వగృహం వద్ద ధనలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాగ శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు శ్రీ వీరేశ్వర స్వామి ధర్మకర్తల మండల సభ్యులు త్సటపల్లి నాగేంద్రరావు (నాగు), చెయ్యేరు సొసైటీ అధ్యక్షులు త్సవటపల్లి శ్రీనివాసరావు( శ్రీను), టిడిపి సీనియర్ నాయకులు త్సవటపల్లి ( రాము) త్సవటపల్లి సుబ్బారావు, అయినవిల్లి మండలం ఎస్ మూల పొలం సొసైటీ అధ్యక్షులు యాళ్ల ఆనందరావు, పలువురు అధికారులు, కాకినాడ, పలు మండలాలకు చెందిన బంధుమిత్రులు గ్రామస్తులు పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

## ప్రయాణం ఒక సవాల్



**పాత కొండూరు: (సిటిజన్ టైమ్స్); సెప్టెంబర్; 05**
ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజవర్గం ,ఏ కొండూరు మండలం పాత కొండూరు కి వెళ్లే రహదారి చెరువు కట్ట రోడ్డు చాలా దారుణంగా ఉంది రాత్రిపూటవెళ్లాలన్న పగలు వెళ్లాలన్న ఆ గ్రామప్రజలుబాగాఇబ్బందులుపడుతున్నారు . పొలాలకు వెళ్లాలన్న, కాలేజీకి స్కూల్స్ కి వెళ్లాలన్న ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు.మా యందు దయ ఉంచి రోడ్డు వేయించండి అని గ్రామస్తులు అందరూ ప్రభుత్వాన్ని కోరుతున్నారు .

## సకల విద్య బోధనలకు మూలం గురువులే ఆధారం



**బద్వేలు, సిటిజన్ టైమ్స్: సెప్టెంబర్ 5**
ప్రపంచంలో సకల విద్య బోధనలకు గురువులే ఆధారమని బద్వేలు పట్టణ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు అన్నారు బుధవారం ఉపాధ్యాయ దినోత్సవం మరియు (డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి ) సందర్భముగా బద్వేల్ పట్టణ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అధ్యక్షులు నానా బాల వెంకటేశ్వర్లు కార్యదర్శి బీసీ గురుమూర్తి మరియు ఆవాస్ కమిటీ అధ్యక్షులు ఎస్ ఏ సత్తార్ మరియు సొసైటీ సభ్యులు అందరూ కలిసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాయ్స్ ప్రధానోపాధ్యాయులైన గాజుల పల్లె వెంకటసుబ్బారెడ్డి ని మరియు ఇదే పాఠశాలలో పిజిటిగా పనిచేసి రిటైర్ అయిన మారెళ్ళ శ్రీనివాసులు ని వారి సేవలను గుర్తించి ఘనంగా సత్కరించడమైనది ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరము ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ గురువులను గౌరవిస్తూ పట్టణములోని సమస్యలను అధికారుల దృష్టికి తెస్తూ మరియు పట్టణ ప్రజలకు అవసరమైన సామాజిక కార్యక్రమాలను చేస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కోసం నిరంతరము కమిటీ సభ్యులతో కలిసి సమస్య పరిష్కారం కోసం ఈ కమిటీ పని చేయుచున్నదని తెలియజేశారు ప్రధానోపాధ్యాయులు మరియు శ్రీనివాసులు గారు వారికి కృతజ్ఞత అభివందనాలు తెలియచేశారు ఈ కార్యక్రమంలో పాఠశాలలోని ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైల్వే లైన్ సాధనకు మద్దతు ఇవ్వాలి

### కోటిపల్లి- నర్సాపురం రైల్వే లైన్ సాధన సమితి



**పి.గన్నవరం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 5**
ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కోనసీమ జేఏసి కార్యవర్గం పి.గన్నవరం నియోజకవర్గంలో గల పలు జూనియర్, డిగ్రీ కళాశాలలు విద్యాసంస్థలను సందర్శించి ఉపాధ్యాయులకు,అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలియచేసింది.కోటిపల్లి - నర్సాపురం రైల్వేలైన్ సాధన కొరకు జేఏసి చేస్తున్న పోరాటానికి మద్దతునివ్వాలని కోరింది.విద్యార్థులతో మమేకం అయ్యింది.సామాజిక స్పృహ తో మెలగాలని విద్యార్థులకు పిలునిచ్చింది.కోనసీమ ప్రాంతానికి రైలు సౌకర్యం లేకపోవడం వలన అభివృద్ధి లేకండా పోయిందని, ముఖ్యంగా విద్యార్థులు తీవ్రంగా నష్టబోతున్నారని పేర్కొంది.కోనసీమ విద్యా, వైద్య ,సాంస్కృతిక,వ్యాపార,పర్యాటక ,ఆర్థిక పరంగా అభివృద్ధి చెందాలంటే రైలు సౌకర్యం ఉండాలని విపులికిరించింది.కోనసీమ అభివృద్ధి రైలు రాకతో ముడిపడివుంది అనే విషయాన్ని స్పష్టం చేసింది.కన్వీనర్ బండారు రామమోహన్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమాల్లో జేఏసి సభ్యులు భాగవతుల మూర్తి,డా.మధుర నరసింహ మూర్తి,రంకిరెడ్డి శ్రీనివాస్,మడికి శ్రీరాములు,వీరీన గోపాలం ఆయా కళాశాలలు ప్రిన్సిపల్స్ నాయుడు,ప్రసాద్,శర్మ లతో పాటు అధ్యాపక,ఆధ్యకేతర సిబ్బంది,పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆనందపురం ప్రధాన రహదారి విస్తరణ ఎప్పుడో..?

### రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలు.. ప్రజల నిరీక్షణకు ఎప్పుడు ముగింపు..?

### ఇరుకైన రహదారితో ఉదయం వేళల్లో భారీ ట్రాఫిక్ జామ్

### ఎనిమిది గ్రామాలకు ప్రధాన మార్గం.. 20కి పైగా స్కూల్ బస్సుల రాకపోకలు

### బస్సు వస్తే పక్కన ఆటో, బైక్ వెళ్లలేని పరిస్థితి.. విద్యార్థులకు తప్పని తిప్పలు

### ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యపై ప్రజల ఆవేదన

**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**
ఆనందపురం గ్రామపంచాయతీ ప్రధాన రహదారి విస్తరణ సమస్య ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆనందపురం గ్రామంతో పాటు దాదాపు ఎనిమిది గ్రామాలకు ప్రధాన రహదారిగా ఉన్న ఈ మార్గం రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రాకపోకలకు సరిపోని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఉదయం వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. ప్రైవేట్ పాఠశాలలకు చెందిన దాదాపు 20కి పైగా స్కూల్ బస్సులు ఇదే రహదారి గుండా రాకపోకలు సాగిస్తుండగా, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, మార్కెట్‌కు వెళ్లే రైతులు, ఇతర వాహనాలు అధిక సంఖ్యలో ఈ మార్గాన్ని వినియోగిస్తున్నారు. దీంతో ప్రతిరోజూ ఉదయం ప్రధాన రహదారి ట్రాఫిక్‌తో కిక్కిరిసిపోతోంది. రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటంతో ఒక బస్సు ఎదురుగా వచ్చిన సమయంలో దాని పక్క నుంచి ఆటో లేదా ద్విచక్ర వాహనం వెళ్లేందుకు కూడా సరైన స్థలం లేకపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. చిన్నపాటి వాహనాల రద్దీ ఏర్పడినా వెంటనే ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు గంటల తరబడి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ ట్రాఫిక్ సమస్య కారణంగా ఉదయం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్కూల్ బస్సులు ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో విద్యార్థులు ఆలస్యంగా పాఠశాలలకు చేరుకునే పరిస్థితి ఏర్పడుతోంది. కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఆనందపురం గ్రామంలోకి బస్సులు నడపడం ఇబ్బందిగా ఉందని భావిస్తూ, గ్రామంలోని కొంతమంది విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించడంలో కూడా వెనుకంజ వేస్తున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ సమస్య కొనసాగుతున్నప్పటికీ, ప్రభుత్వాలు మారినా ఆనందపురం ప్రధాన రహదారి విస్తరణకు మాత్రం శాశ్వత పరిష్కారం లభించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. పెరుగుతున్న




జనాభా, వాహనాల సంఖ్యకు అనుగుణంగా రహదారిని విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, సంబంధిత ప్రభుత్వ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆనందపురం ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా స్థానిక ఎమ్మెల్యే స్పందించి, ఎనిమిది గ్రామాల ప్రజలకు కీలకమైన ఈ ప్రధాన రహదారి విస్తరణకు చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. “ప్రజల ఇబ్బందులు పెరగకముందే.. ఆనందపురం ప్రధాన రహదారి విస్తరణకు చర్యలు తీసుకోవాలి” అని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# బోడసకుర్రు లో పశు ఉచిత వైద్య శిబిరం



**అల్లవరం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 5**
మండలం లోని బోడసకుర్రు గ్రామం లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భ కోసం పశు వైద్య శిబిరం డా.మేడిద నారాయణరావు బోడసకుర్రు గ్రామ ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో డా. చంద్ర శేఖర్ రెడ్డి , ఉప సంచలకులు వారు (ఇంచార్జ్)పశుసంవర్ధక శాఖ పాడి రైతులను ఉద్దేశించి ఈ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని, ఎదకురాని, తిరుగుప్రోలు పశువులు,ఎదకొచ్చిన పశువులు, చూలు పరీక్షలు పశువులలో గర్భకోశ సమస్యలు రైతులు పశు వైద్యాలకు వివరించి తగు చికిత్సలు పశువులకు చేయించాలని విబిజి రామ్ పథకంలో మండలానికి ఏడు చొప్పున మినీ గోకులంలో(పశువుల శాలలు) ప్రభుత్వ పథకం అందుబాటులో ఉన్నదని తెలిపి ఉన్నారు. డా.విజయ రెడ్డి సహాయ సంచాలకులు రైతులను ఉద్దేశించి తమ పశువులకు సకాలంలో నత్తల నివారణ మందులు, గర్భకోస వ్యాధులకు చికిత్సలు పశువులకు ఈ క్యాంపును ఉపయోగించుకోవాలని రైతులు కోరి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల బాబీ గారు అల్లవరం మండలం తెలుగు యువత అధ్యక్షులు,దొమ్మేటి భావన్న,రొక్కాల సత్యనారాయణ,ఇసుకపట్ల సురేష్ రైతులు, డా. కావ్య, డా. శివతేజ, రోళ్ల సాయి, కన్న బాబు గోపాలమిత్రలు, ప్రిన్సి బోడసకుర్రు పశుసంవర్ధక సహాయకురాలు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## లంబాడి సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలి

### లేనియెడల భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు ఉండవని హెచ్చరిస్తున్నాం

### లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు

**సిటిజన్ టైమ్స్ మహబూబాబాద్ సెప్టెంబర్ 5**
మహబూబాబాద్ ఎమ్మార్వో సెంటర్లో ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా కమిటీ ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్ మాట్లాడుతూ అతిపెద్ద గిరిజన జిల్లా అయిన మానుకోట జిల్లాలో లంబాడి సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే లలో ఒకరికి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో లంబాడీలు దాదాపుగా 25 లక్షల మంది ఉన్నారని, ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 5 లక్షల మంది లంబాడీలు ఉన్నారని అదేవిధంగా అత్యధిక లంబాడీలు కలిగిన ఏకైక పార్లమెంట్ స్థానం మహబూబాబాద్ లో 5 లక్షల మంది లంబాడీలు ఉన్నారని, మహబూబాబాద్ జిల్లాలో 2,75,000 మంది ఉన్నారని అన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో ఎస్టీ నియోజకవర్గాలు 12 ఉంటే లంబాడీల సహకారంతో తో దాదాపుగా 30 సీట్లు గెలుస్తాయని అన్నారు. లంబాడీలు గంపగుత్తగా కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయడం వలనే కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిందని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు గడిచిన కూడా ఇప్పటివరకు లంబాడి సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వకపోవడం సిగ్గుచేటని అన్నారు. గత ప్రభుత్వంలో లంబాడి సామాజిక వర్గానికి పెద్దపీట వేశారని, ఈ ప్రభుత్వం మాత్రం లంబాడి సామాజిక వర్గాన్ని విస్మరిస్తుందని అన్నారు. ఇకనైనా జరగబోయే మంత్రివర్గ విస్తరణలో లంబాడి సామాజిక వర్గానికి చెందిన, అతిపెద్ద గిరిజన జిల్లా అయినా మహబూబాబాద్ జిల్లా ఎమ్మెల్యేలలో ఒకరికి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.



# రంగులు మార్చే రసజ్ఞుడు.. అద్భుతాలకు నిలయం

## కేరళపురం వినాయకుడు!

### రచయిత బొల్లు రామ్మోహన్






**బద్వేలు సిటిజన్ టైమ్స్ సెప్టెంబరు 5:**

మనదేశంలో ఆధ్యాత్మికతకు, ప్రకృతి సిద్ధమైన వింతలకు కొదవ లేదు. ఎన్నో పురాతన ఆలయాలు తమ విశిష్టతలతో, మహిమలతో మనల్ని ఆశ్చర్యచకితులను చేస్తూనే ఉంటాయి. అలాంటి ఆధ్యాత్మిక వింతలలో తమిళనాడులోని నాగర్‌కోయిల్ సమీపంలో ఉన్న కేరళపురం 'శ్రీ మహదేవర్ అతిశయ వినాయగర్ ఆలయం' అత్యంత ప్రాధాన్యత కలిగినది. పరిమాణంలో ఈ ఆలయం చిన్నదే కావచ్చు... కానీ ఇక్కడ జరిగే అద్భుతాలు మాత్రం ఆ భగవంతుని లీలలకు సజీవ నిదర్శనాలు.

**ఈ క్షేత్రం మహిమాన్వితమైన మూడు ప్రధాన అద్భుతాలకు కేంద్రబిందువు:** రంగులు మార్చే మూలవిరాట్: ఉత్తరాయణ కాలంలో (జనవరి నుండి జూన్ వరకు) నల్లని వర్ణంలో దర్శనమిచ్చే వినాయక స్వామి, దక్షిణాయన కాలం (జూలై నుండి డిసెంబర్ వరకు) రాగానే తెల్లని రంగులోకి మారిపోతాడు. కాల చక్రానికి అనుగుణంగా స్వామివారి రూపంలో వచ్చే ఈ రంగుల మార్పు భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తుతుంది.

**బావి నీటి వింత:** ఆలయ ఆవరణలోని బావి నీరు స్వామివారి రంగుకు పూర్తి భిన్నంగా మారడం మరొక విచిత్రం. వినాయకుడు నల్లగా ఉన్నప్పుడు బావిలోని నీరు తెల్లగా, స్వామివారు తెల్లగా మారినప్పుడు బావి నీరు నల్లగా కనిపిస్తాయి. ప్రకృతి సూత్రాలకు అందని ఈ దృశ్యం స్వామివారి దివ్య శక్తికి అద్దం పడుతుంది. కాలానుగుణ మర్రిచెట్టు: దట్టమైన కేరళ-తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లోని చెట్లు సాధారణంగా ఎల్లప్పుడూ పచ్చగా (సతత హరితంగా) ఉంటాయి. కానీ, ఈ ఆలయ ప్రాంగణంలోని మర్రిచెట్టు మాత్రం దక్షిణాయనంలో ఆకులు రాల్చి, ఉత్తరాయణంలో మళ్లీ కొత్త చిగుళ్లతో పరవశిస్తుంది.

ఈ ప్రాకృతిక వింతలు, స్వామివారి దివ్య లీలలు కలగలిసిన ఈ పుణ్యక్షేత్రాన్ని భక్తులు "మిరాకిల్ వినాయక ఆలయం" అని పిలుచుకుంటారు. నమ్మకంతో వచ్చి ఆ విఘ్నేశ్వరుని దర్శించుకునే భక్తుల జీవితాల్లోని చీకట్లను తొలగించి, వారి కోరికలను నెరవేర్చే ప్రత్యక్ష దైవంగా శ్రీ మహదేవర్ అతిశయ వినాయకుడు విలసిల్లుతున్నాడు.

**వ్యాసరచన : బొల్లు. రామ మోహన్, రచయిత పోరుమామిళ్ల.**

# రూ.9.52 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

## ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలే లక్ష్యం: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు



**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 5**

మండలంలోని అయినాపురం గ్రామంలో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించే దిశగా పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రూ.62.14 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్లను, రూ.7.59 కోట్ల వ్యయంతో నిర్మించిన అయినాపురం ఆర్ అండ్ బి రోడ్డును ప్రారంభించారు. రూ.1.31 కోట్ల వ్యయంతో నిర్మించిన బాడవ ఆర్ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం..:** ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా ప్రజల రాకపోకలకు మరింత సౌకర్యం కలుగుతుందని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతూ ముమ్మిడివరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, గ్రామస్తులు మరియు మీడియా మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

# గురువులు నేర్పేది మంచిమార్గమే.. వ్యక్తి వినాశనానికి స్వార్థమే కారణం

## రావణాసురుడు, దుర్యోధనుడు గొప్ప గురువుల వద్ద విద్య నేర్చుకున్నవారే

## ఉత్తమ గురువులను ఘనంగా సత్కరించిన తెలుగు శక్తి - తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

గురువులు విద్యార్థులకు ఎప్పుడూ మంచి మార్గాన్నే చూపిస్తారని, ఒక వ్యక్తి తప్పుదోవ పట్టడానికి గురువులు నేర్పిన విద్య కారణం కాదని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. రావణాసురుడు, దుర్యోధనుడు వంటి వారు కూడా గొప్ప గురువుల వద్ద విద్యను అభ్యసించినప్పటికీ, వారి స్వార్థం, అహంకారమే చివరకు వారి వినాశనానికి కారణమయ్యాయని వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం విశాఖపట్నంలోని మేఘాలయ హోటల్‌లో తెలుగు శక్తి ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాష్ట్రపతుల చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ఐదుగురు విశిష్ట గురువులను బి.వి.రామ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గురు బ్రహ్మ, గురు విష్ణు, గురు దేవో మహేశ్వర... గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః" అనే శ్లోకాన్ని మన సమాజం, ప్రభుత్వాలు నిజమైన భావంతో గౌరవిస్తున్నాయా అని ప్రశ్నించారు. ఒక సాధారణ ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు దేశ అత్యున్నతమైన రాష్ట్రపతి పదవిని అధిష్టించే అవకాశం కల్పించిన గొప్ప సంస్కృతి భారతదేశానికి ఉందని గుర్తు చేశారు. దీనిని బట్టి మన దేశంలో ఉపాధ్యాయ వృత్తికి ఉన్న గౌరవం ఎంత గొప్పదో అర్థమవుతుందని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు లేదా ఇతర రంగాల్లోని వ్యక్తులు అవినీతికి పాల్పడితే అందుకు వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను బాధ్యులను చేయలేమని బి.వి.రామ్ స్పష్టం చేశారు. ఒక వ్యక్తి అవినీతిపరుడిగా మారడానికి సమాజంలోని పరిస్థితులు, వ్యవస్థలోని లోపాలు, వ్యక్తిగత స్వార్థం, తీసుకునే నిర్ణయాలే కారణమని అన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థులకు అక్షరజ్ఞానం, నైతిక విలువలు, క్రమశిక్షణ, మంచి వ్యక్తిత్వాన్ని మాత్రమే బోధిస్తారని తెలిపారు. "ఏ ఉపాధ్యాయుడు కూడా విద్యార్థికి అవినీతి చేయాలని, ప్రజలను మోసం చేయాలని నేర్పడు. విద్యార్థి దశ దాటిన తర్వాత వ్యక్తి ఎలాంటి మార్గాన్ని ఎంచుకుంటాడనేది అతని సొంత నిర్ణయం, విచక్షణపై ఆధారపడి ఉంటుంది" అని పేర్కొన్నారు. రామాయణంలోని రావణాసురుడు, మహాభారతంలోని దుర్యోధనుడు సైతం గొప్ప గురువుల వద్ద విద్యను అభ్యసించినవారేనని గుర్తు చేశారు. అయినప్పటికీ వారి జీవితాల పతనానికి స్వార్థం, అహంకారమే ప్రధాన కారణాలని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమ తమ రంగాల్లో రాణిస్తున్నారంటే దాని వెనుక గురువుల కృషి ఎంతో ఉందని కొనియాడారు. తాను కూడా సమాజంలోని ప్రతి ఒక్కరి నుంచి ఏదో ఒకటి నేర్చుకున్నానని, తనకు మార్గదర్శనం చేసిన ప్రతి ఒక్కరినీ గురువులుగానే భావిస్తానని బి.వి.రామ్ తెలిపారు.

**ఉత్తమ పౌరుల తయారీలో గురువులదే కీలక పాత్ర**

సన్మాన గ్రహీతలు శ్రీమతి పిల్ల నిర్మల, శ్రీమతి జే. సరోజినీ దేవి, శ్రీమతి పి. కృష్ణవేణి మాట్లాడుతూ సమాజానికి ఉత్తమ పౌరులను అందించే గొప్ప బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అత్యుత్తమ నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులను గుర్తించి తెలుగు శక్తి ఆధ్వర్యంలో సన్మానించడం ఆనందంగా ఉందని తెలిపారు. భారత రాష్ట్రపతుల చేతుల మీదుగా అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను గుర్తించి ప్రత్యేకంగా గౌరవించడం అభినందనీయమని పేర్కొన్నారు. మంచి వ్యక్తిత్వంతో బి.వి.రామ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు.

**బోధనా వృత్తిపై తగ్గుతున్న ఆసక్తి ఆందోళనకరం**

ప్రొఫెసర్ బి. బ్రహ్మానందరావు, కె. ఫణి భూషణ్ శ్రీధర్ మాట్లాడుతూ గురువులను దైవంతో సమానంగా భావించే భారతదేశంలో ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించేందుకు ఆసక్తి చూపుతున్న వారి సంఖ్య క్రమంగా తగ్గడం ఆందోళనకరమని అన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల కోసం తెలుగు శక్తి గురుపూజోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమైన కార్యక్రమమని పేర్కొన్నారు. ఐఐటీ వంటి అత్యున్నత విద్యాసంస్థల్లో కూడా నైపుణ్యంతో బోధించే అధ్యాపకుల కొరత కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం భారత రాష్ట్రపతుల చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న విశిష్ట గురువులను శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ యాక్టివిస్ట్ పాలూరు శేషమాంబ, డాక్టర్ పఫూర్ నికుంజ్, ఫిల్మ్ డైరెక్టర్, సోషల్ యాక్టివిస్ట్ వి. వంశీబాబు, బొల్లినేని వెంకటేశ్వరరావు, కె. రాజు తదితరులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో మహిళలు, ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రెండేళ్ల నమ్మకం- అభివృద్ధి సంక్షేమం



**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 5**

డోర్ టు డోర్ కార్యక్రమంలో భాగంగా పి. గన్నవరం నియోజకవర్గం, అయినవిల్లి మండలం, తొత్తరమూడి గ్రామంలో మాజీ రాష్ట్ర కార్యదర్శి క్లస్టర్ 11 కన్వీనర్ లిమద్దాల సుబ్రహ్మణ్యేశ్వర రావులి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల ప్రచారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలు గా అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లిగుత్తుల సాయిలి ముఖ్యఅతిథిగా హాజరై రెండు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమం ముందెన్నడూ లేని విధంగా అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్తోంది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లిగంధం పళ్ళం రాజు, ఏఎంసీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్‌లి మండల పార్టీ అధ్యక్షులు లివస్కా శ్యాంసుందర్‌లి క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ లిసయ్యపరాజు సత్తిబాబు రాజులి, సీనియర్ నాయకులు లిసలాది బాబురావు, మాజీ ఎంపీపీ సలాది పుల్లయ్య నాయుడు,లి రాష్ట్ర హెచ్ఆర్డి సభ్యులు లినేదునూరి వీర్రాజులి రాష్ట్ర ఎంబీసీ కన్వీనర్ లిపెంద్ర రమేష్‌లి నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు లిమద్దాల రాజాలి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి లిమేడిశెట్టి అంజిబాబులి సిరిపల్లె సొసైటీ అధ్యక్షులు లిబిక్కిన బాబి,విఘ్నేశ్వర స్వామి దేవస్థానం పాలక మండల సభ్యులు బొబ్బిలి రాంబాబు,కాజా త్రినాధ రంగారావు,నిమ్మకాయల సత్యనారాయణ, విళ్ళ నవీన్, మండల బీసీ సెల్ అధ్యక్షులు వెలిగట్ల సాయిబాబు,మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు నేదునూరి నాని,నేదునూరి సత్యనారాయణ,గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి లికొడమంచిలి శ్రీనివాస్‌లి మాజీ ఎంపీటీసీ లిగెడ్డం అప్పారావు ,వార జయ సావిత్రి లక్ష్మీనరసింహారామ్‌లి యూనిటీ ఇంచార్జ్ లిఅమలకట్ట చక్రవర్తిలి లినామాడి వాసు,బూత్ ఇంచార్జ్ కొడవటి శ్రీధర్‌లి తదితరులు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

## 61 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం.

## - జిల్లా జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్. నైడియా దేవి.



**అమలాపురం, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 05**

యువత మనసులను తీర్చిదిద్దడంలోనూ, బలమైన సమాజాన్ని నిర్మించడంలోనూ ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని జిల్లా జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్. నైడియా దేవి తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల ఆర్థిక సహకార సంస్థ చైర్ పర్సన్ రెడ్డి అనంత కుమారి, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెటి చంద్రమౌళి, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు తోకలిసి జ్యోతి ప్రజ్వలన గావించి డాక్టర్. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులే దేశ భవిష్యత్తు అని, వారి వ్యక్తిత్వ వికాసానికి, ఉన్నత లక్ష్యాల సాధనకు ఉపాధ్యాయుల బోధన, మార్గదర్శకత్వం ఎంతో అవసరమన్నారు. నేటి సమాజం లో ప్రజాప్రతినిధులు,జిల్లా కలెక్టర్, జిల్లా పోలీస్ అధికారులు, లాయర్లు, శాస్త్రవేత్తలుగా వివిధ రంగాల్లో రాణిస్తున్న వారి విజయాల వెనుక పాఠశాల స్థాయి ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని పేర్కొన్నారు. దేశ రెండవ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని, ఉపాధ్యాయుల దినోత్సవం జరుపుకోవడం చాలా సంతోషదాయమన్నారు. సమాజంలో తల్లిదండ్రులు గురువు నిత్య పూజనీయులని, అలాంటి ఉత్తమ ఉపాధ్యాయులకి సన్మానం నిర్వహించడం ఆనందదాయకంగా ఉందన్నారు. 61 మంది ఉత్తమ సన్మాన గ్రహీత ఉపాధ్యాయులకు సాలువాలు కప్పి, సన్మానించి వారి సేవలకు ప్రశంస పత్రాలను పంపిణీ చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి డా.. మహబూబ్ బాషా మాట్లాడుతూ కోనసీమ జిల్లా రాష్ట్ర స్థాయిలో విద్యాపరంగా ఉత్తమ స్థానంలో నిలవడానికి అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులే కారణమని పేర్కొన్నారు. డీసీఎంసీ చైర్మన్ పెచ్చేటి చంద్రమౌళి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి కేవలం పురస్కారాలు,అవార్డులకే పరిమితం కాదని,విద్యార్థుల ఆలోచనా విధానంలో,జీవితంలో తీసుకొచ్చే సానుకూల మార్పే ఉపాధ్యాయులకు అసలైన విజయమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల ఆర్థిక సహకార సంస్థ రెడ్డి అనంత కుమారి మాట్లాడుతూ సమాజ మార్పు, దేశ నిర్మాణం, యువత భవిష్యత్తు మార్చే మార్గదర్శకులు ఉపాధ్యాయులని తెలియజేశారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి. సుబ్బారావు,సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.మమ్మీ,జిల్లా విద్యాశాఖ ఏడీ నక్కా సురేష్, డీవైఈవోలు డి.సురేష్‌కుమార్, కె.వెంకటేశ్వరరావు, పి.రామలక్ష్మణమూర్తి, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, డి.రమేష్‌బాబు, పి.రాంబాబు,డా.. ఎంఏకే భీమారావు,ఎం.వీ.వీ. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్ పై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల పిలుపు




**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 5**

సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పిలుపునిచ్చాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ హక్కుల సాధన కోసం హైదరాబాద్ లో భారీ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో కార్యాలయంలో చలో హైదరాబాద్ వాల్ పోస్టర్ ను విడుదల చేశారు. టీజీ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా చైర్మన్ బావండ్ల వెంకటేష్ అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. సమావేశానికి వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు హాజరయ్యారు. పెండింగ్ పీఆర్సీ, పెండింగ్ బిల్లుల చెల్లింపుపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులందరికీ ఈహెచ్ఎస్ కార్డుల పూర్తి స్థాయి అమలు చేయాలని, ఓపీఎస్ సాధన కోసం ఐక్యంగా పోరాడాలని డిమాండ్ చేశారు. పెన్షన్ ప్రతి ఉద్యోగి జన్మహక్కు అంటూ నినాదం చేశారు. ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడు తమ వంతు బాధ్యతగా చలో హైదరాబాద్ కు తరలిరావాలని, హైదరాబాద్ లో జరిగే హక్కుల సాధన సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ విజయవంతం చేస్తామని నేతలు తీర్మానించారు. కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, ఎండీ షర్ఫుద్దీన్, మునగాల సతీష్ కుమార్, సీహెచ్ వెంకట్, సంజీవ, అమరేందర్ రెడ్డితో పాటు పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులు

**రామచంద్రాపురం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 5**

అంబేద్కర్ కోనసీమ జిల్లా,రామచంద్రాపురం నియోజకవర్గం, ద్రాక్షారామలో, గురుపూజోత్సవం సందర్భంగా ద్రాక్షారామ లో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద యాట్ల వైష్ణవి సిరి మహా లక్ష్మీ అనే చిన్నారి సావిత్రిబాయి పూలే వేషధారణలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలతో పూజించి నివాళులు అర్పించింది. అనంతరం ఆమె చేసిన త్యాగానికి కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆమెకు అత్యంత ప్రతిష్టాత్మకమైన భారతరత్న ఇవ్వాలని డిమాండ్ తో ప్లకార్డ్ పట్టుకొని నిరసన వ్యక్తం చేసింది.



# నాగర్ కర్నూల్ లో బీఆర్ఎస్ భారీ రైతు నిరసన

## రైతుల కరెంటు కట్ చేసిన రేవంత్.. అధికారాన్ని కూడా కట్ చేస్తాం: నిరంజన్ రెడ్డి



సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 5

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల అసమర్థ పాలనకు నిరసనగా నాగర్ కర్నూల్ లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ రైతు నిరసన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో వెలమ ఫంక్షన్ హాల్ నుంచి సబ్ స్టేషన్ వరకు సుమారు 200 ట్రాక్టర్లతో రైతులు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ



రైతుల కరెంటు కట్ చేసిన రేవంత్ అధికారాన్ని కూడా కట్ చేస్తామని హెచ్చరించారు. కేసీఆర్ హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుభీమా, మద్దతు ధర, సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను పట్టించుకోవడం లేదని, కృష్ణా, గోదావరి వరద నీటిని వినియోగించడంలో, కల్వకుర్తి ఎత్తిపోతల మోటార్లు నడపడంలో, శ్రీశైలం నుంచి ఏపీకి నీటి తరలింపును అడ్డుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. యూరియా కోసం రైతులను యాప్ ల చుట్టూ తిప్పడం దారుణమని బీ ఆర్ ఎస్ ప్రభుత్వంలో వచ్చాక యూరియా యాప్ ను మూసిలో కలుపుత, రూ.250 యూరియా కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. బస్టాండ్ కూడలిలో ఉట్టికి యూరియా బస్తాలు కట్టి బీఆర్ఎస్ వినూత్న నిరసన తెలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు పిండాకూడు పెట్టే సమయం ఆసన్నమైందని, సీఎం, మంత్రుల మధ్య సఖ్యత లేక రాష్ట్రానికి నష్టం జరుగుతోందని, ఢిల్లీ పర్యటనలు తప్ప రేవంత్ కు పాలనపై పట్టు లేదని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన 420 హామీలు హామీలుగానే మిగిలాయని, ఆరు గ్యారంటీల్లో ఒక్కటీ సక్రమంగా అమలు కాలేదని ఆరోపించారు. రైతుభరోసా, రైతుభీమా, వరికి బోనస్, సాగునీరు, విద్యుత్ లో ప్రభుత్వం విఫలమైందని, షాపుల్లో యూరియా లేకుండా యాప్ లో నమోదు చేయడం రైతులను మోసం చేయడమేనని, బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే యూరియా యాప్ ను మూసేస్తామని ప్రకటించారు. అనంతరం విద్యుత్ సమస్యలపై ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల సాధనకై హలో కార్మిక, చలో కరీంనగర్

**సెప్టెంబర్ 6న కరీంనగర్ లో**

**50 వేల కార్మికులతో ర్యాలీ, భారీ బహిరంగ సభ**

**భారీ బహిరంగ సభ కు జిల్లా నలుమూలల నుండి**

**కార్మికులు వేలాదిగా తరలిరండి**

**మారేడు శివశంకర్ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి**




సిటిజన్ టైమ్స్ తెలంగాణ రాష్ట్ర బ్యూరో సెప్టెంబర్ 5

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మణ ఆచారి భవన్, సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏఐటీయూసీ ముఖ్య కార్యకర్తల మీటింగ్ లో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ పాల్గొని మాట్లాడుతూ సెప్టెంబర్ 6 7 8 తేదీలలో కరీంనగర్ పట్టణంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాలుగో మహాసభలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు, కార్మిక సోదరులు అందరూ పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమానికి సిపిఐ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి, ఏఐటియుసి రాష్ట్ర ఇంచార్జ్ వివిఎస్ బోస్,ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎండి యూసుఫ్, ఎస్ బాలరాజు, ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గం, కౌన్సిల్, తో పాటు ప్రతినిధులుగా 500 మంది పాల్గొంటారు, 1920లో అక్టోబర్ 31న ఆవిర్భవించి ఎన్నో సవాలనే ఎదుర్కొని నేటికీ 105 సంవత్సరాలు ఏఐటీయూసీ పూర్తి చేసుకున్నది, ఏఐటియుసి పోరాటత ఫలితంగా అనేక కార్మిక చట్టాలను సాధించడం జరిగింది, అన్ని కార్మిక వర్గాల హక్కుల కోసం, నిరంతరం పోరాడుతూ కార్మికుల పక్షాన నిలబడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తుంటే చూస్తూ ఊరుకోకుండా హక్కులను కాపాడుకోవాలని కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు కర్షకులు, కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని, పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని మున్సిపాల్టీ, పంచాయతీ కార్మికులకు ఒకటో తారీఖున జీతాలు ఇవ్వాలని మున్సిపాలిటీ కార్మికులకు వారాంతపు సెలవులు, నెల సెలవులు, క్యాజువల్ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం తలొగ్గి డిమాండ్లను అంగీకారించింది, అదేవిధంగా ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు సాధించుటకై కొరకు తెలంగాణ వ్యాప్తంగా ఆగస్టు 24న బంధువుకి పిలిపిస్తే రాష్ట్ర ప్రభుత్వం త్వరలో తోటి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి 13 రకాల డిమాలను ఇవ్వడం జరిగింది, ఎన్నో రకాలుగా పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులు ఇంకా ఎన్నో సాధించుకోవాల్సింది, 44 చట్టాలను రద్దుచేసిన కేంద్ర ప్రభుత్వాన్ని మెడల్వంచి 44 కార్మిక చట్టాలను పునరుద్ధించాలని హలో కార్మిక,చలో కరీంనగర్ పట్టణంలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాగర్ కర్నూల్ మండల నాయకులు ఈర్ల హుస్సేన్, కొత్త రామస్వామి, వంకేశ్వరం శ్రీనివాసులు, చారి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

## శెట్టిబత్తుల సత్యనారాయణ మాస్టారికి జిల్లా స్థాయి "ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం" - గోడిలంక గ్రామానికి గర్వకారణం

అల్లవరం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 5

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని, అమలాపురంలోని కలెక్టరేట్ (గోదావరి భవన్) నందు నిర్వహించిన వేడుకల్లో గోడిలంక గ్రామ సభ్యులు సీనియర్ ఉపాధ్యాయులు శెట్టిబత్తుల సత్యనారాయణ మాస్టారు జిల్లా స్థాయి "ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని" అందుకున్నారు.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. పేదరికంలో జ్ఞాన్మించి అంబేద్కర్ ఆశయాలు ఉనికిపుచ్చుకొని ?చిన్ననాటి నుండి ఎంతో శ్రమించి, ఎన్నో వ్యయప్రయాసలనోర్చి విద్య ద్వారా తన ప్రతిభను నిరూపించుకున్న సత్యనారాయణ మాస్టారు, అత్యంత బాధ్యతాయుతమైన ఉపాధ్యాయ వృత్తిలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. అంకితభావంతో పనిచేస్తూ ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో జ్ఞాన వెలుగులు నింపిన ఆయన నిబద్ధతకు, విద్యాసేవకు లభించిన సరైన గుర్తింపు ఈ పురస్కారమని, ఇది గోడిలంక గ్రామానికి ఎంతో గర్వకారణమని గ్రామ ప్రజలు, పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసి దుర్గారావు మాట్లాడుతూ... "సత్యనారాయణ మాస్టారు యువత నాడిని పసిగట్టి, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే నిస్వార్థ విద్యావేత్త. అహర్నిశలు శ్రమించి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడమే కాకుండా, సమాజానికి సరైన దిశానిర్దేశం




చేస్తున్న అభినవ విద్యాధారి ఆయన. ఆయన సేవలు ఉపాధ్యాయ లోకానికే మార్గదర్శకం" అని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తికే సార్థకత చేకూర్చిన సత్యనారాయణ మాస్టారికి గ్రామ ప్రజలు,పూర్వ విద్యార్థులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శెట్టిబత్తుల తులసి దుర్గారావు, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్, అంబేద్కర్ కోనసీమ జిల్లా కుటుంబ సభ్యులు శెట్టిబత్తుల బాలకృష్ణ మూర్తి రామారావు. నాగేశ్వరరావు. శ్రీరాములు. ప్రకాష్ రావు. ఏసుకొండలు, రాంబాబు మరియు గ్రామ ప్రజలు , పూర్వ విద్యార్థులు,గుమ్మల్ల శ్రీనివాసరావు. గోసంగి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి ఆక్వా ఆక్రందన..! -ఆక్వా రైతులు తరలి రావాలని పిలుపు

## రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి అమలాపురం వేదికగా ఉద్యమ కార్యచరణ..

## ఈనెల 7న ఛలో అమలాపురం కార్యక్రమానికి పిలుపు..



అమలాపురం, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 5

గోదావరి జిల్లాల బ్యూరో ఇన్చార్జ్. ఆక్వా సాగులో వరుస నష్టాలతో సతమతమవుతున్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్న ఆక్వారైతులు మరోసారి రాష్ట్ర స్థాయి ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.. ఈనేపథ్యంలోనే ఉద్యమ కార్యచరణ కోసం ఈనెల 7న ఛలో అమలాపురం కార్యక్రమాన్ని ప్రకటించారు. ఆక్వా పరిశ్రమ ఉన్న నెల్లూరు జిల్లా నుంచి శ్రీకాకుళం వరకు ఆక్వా రైతు నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. అమలాపురంలో భారీ బహిరంగ సభ నిర్వహించి తద్వారా ఉద్యమ కార్యచరణ ప్రకటించనున్నట్లు ఆక్వా రైతులు వెల్లడించారు.ఈ మేరకు రాష్ట్ర ఆక్వా రైతు సంఘ ప్రధాన కార్యదర్శి త్సవటపల్లి నాగభూషణం అధ్యక్షతన అమలాపురంలో శనివారం సమావేశమైన ఆక్వా రైతు నాయకులు ఈనెల 7న నిర్వహించే ఛలో అమలాపురం కార్యక్రమంపై చర్చించారు.ఈసందర్భంగా ఆక్వా రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి నాగభూషనం మాట్లాడుతూ ఆక్వా రంగంలో రైతులు ఎదుర్కొంటున్న వరుస నష్టాలకు ఆక్వా రంగంలో సిండికేట్ వ్యవస్థ, దళారులేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సిండికేట్ వ్యవస్థ ప్రభుత్వాన్ని సైతం కనుసన్నల్లో ఉంచుకుని ఆక్వా రైతులకు అన్యాయంచేస్తుందని మండిపడ్డారు..ఈ నెల 7న ఛలో అమలాపురం కార్యక్రమం ద్వారా ఉద్యమ కార్యచరణ ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లా వరకు ఆక్వారంగ నాయకులు తరలిరావాలని కోరారు. ఛలో అమలాపురం కార్యక్రమం ద్వారా ఆక్వారైతులకు జరుగుతోన్న అన్యాయం పై చర్చించి ఉద్యమ కార్యచరణ ప్రకటించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ఆక్వా రైతు సంఘం కమిటీ నాయులు యాళ్ల వెంకటానందం మాట్లాడుతూ ప్రస్తుతం ఆక్వారైతుల పరిస్థితి ఆపరేషన్ సక్సస్ పేషెండ్ డెడ్ అన్న చందంగా మారిందని, ఆక్వారైతులు తీవ్ర నష్టాల్లోఉన్న ఈ సమయంలో ప్రభుత్వం ఆక్వా రంగాన్ని శాసిస్తున్న సిండికేట్ వ్యవస్థపై ఉక్కుపాదం మోపాలన్నారు. మరో ఆక్వా రాష్ట్ర రైతు సంఘ కమిటీ నాయకులు అల్లూరి రమేష్ రాజు మాట్లాడుతూ అప్పడా చట్టం రైతులకా లేక ఆక్వా పరిశ్రమను శాసిస్తోన్న ఆక్వారంగ పరిశ్రమ దారులకు వర్తించాదా అంటూ ప్రశ్నించారు.. మరో రాష్ట్ర కమిటీ నాయకుడు దాట్ల పృధ్వీరాజు మాట్లాడుతూ ఆక్వారైతులు వరుస నష్టాలనుంచి బయటపడాలంటే తమను తాము కాపాడుకునేందుకు అంతా ఐక్యతతో ముందుకు సాగాలన్నారు.ఈ సమావేశంలో కోనసీమ జిల్లా కార్యదర్శి త్సవటపల్లి మణికంఠ, త్సవటపల్లి నాగేంద్ర, మేడిద శంకరం, మోటూరి నాని, మోటూరి కిరణ్, రుద్రరాజు కాశీరాజు, త్సవటపల్లి రఘు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




సిటిజన్ టైమ్స్ హుస్నాబాద్ , సెప్టెంబర్ 5

ప్రతి విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రభావశీల వంతమైనదని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుస్నాబాద్ నందు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం నాడు ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రుల తర్వాత విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులు పిల్లల సంపూర్ణ మూర్తిమత్వ వికాసానికి తోడ్పడుతారని ప్రిన్సిపాల్ తెలిపారు. పాఠశాలలో విద్య నేర్పే ఉపాధ్యాయులే కాకుండా, మన జీవితంలో అడుగడుగునా మనకు గుణపాఠాలు నేర్పే వారందరూ గురువులతో సమానమేనని తెలుపుతూ, నైతిక విలువలతో కూడిన జీవనం, మంచి నడవడిక, ఆదర్శాలను గురువుల నుండి విద్యార్థులు నేర్చుకుంటారని వివరించారు. గురువు ప్రతి ఒక్కరి జీవనానికి దిక్సూచి లాంటి వాడని తెలుపుతూ, గురువుల ప్రాధాన్యతను వివరించారు. మానవీయ విలువలు తగ్గిపోతున్న నేటి కాలంలో సమాజానికి సరైన దిశా నిర్దేశం చేసే గురుతర బాధ్యత ఉపాధ్యాయుల పైననే ఉన్నదని తెలిపారు. విద్యార్థులు ఉపన్యాస పోటీలో పాల్గొని తమను ప్రభావితం చేసిన గురువుల గురించి ఉపన్యసించారు. తెలుగు అధ్యాపకురాలు శ్రీమతి సుధా మాధురి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడే కాకుండా ప్రపంచమంతా కొనియాడిన గొప్ప తత్వవేత్త అని తెలిపారు. జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నైనా దేవి ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు. ప్రిన్సిపాల్,అధ్యాపకులు మరియు విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలతో సత్కరించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నది. విద్యార్థులు అధ్యాపకులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పులివెందుల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు...



పులివెందుల, సిటీజన్ టైమ్స్, సెప్టెంబర్ 05:

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ అండ్ టు ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు...... ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూఈ రోజు మనందరం ఎంతో ఆనందంగా జరుపు కుంటున్నాము. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జన్మదినాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటాం. ఉపాధ్యాయులు మనకు కేవలం పాఠ్యపుస్తకాలలోని విషయాలను మాత్రమే బోధించరు. మంచి వ్యక్తులుగా ఎలా ఎదగాలో, క్రమశిక్షణ, బాధ్యత, నిజాయితీ, కష్టపడి పనిచేయడం వంటి విలువలను కూడా నేర్పిస్తారు...... మన జీవితంలో తల్లిదండ్రుల తర్వాత అత్యంత ముఖ్యమైన పాత్ర పోషించేవారు ఉపాధ్యాయులే. విద్యార్థినిలు మాట్లాడుతూ మన విజయాల వెనుక ఉపాధ్యాయుల కృషి, ప్రోత్సాహం మరియు ఆశీస్సులు ఎంతో ఉంటాయి. అందుకే మన ఉపాధ్యాయులను ఎల్లప్పుడూ గౌరవించాలి, వారి మాటలను పాటించాలి. విద్యార్థినిలు కేక్ కట్ చేసి టీచర్స్ అందరికీ బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ యు. శ్రీనిత,శివరామిరెడ్డి,ఓబుల్ రెడ్డి, విజయలక్ష్మి వాణి హేమ మహేంద్ర లిఖిత ప్రవలిక మస్తాన్ బి శంకరయ్య విష్ణు శ్రీవాణి కరీమున్నీసా సువర్ణ మొదలైన వారు పాల్గొన్నారు.

## ఘన నివాళి అర్పించిన టిడిపి పార్లమెంట్ కన్వీనర్



సిటిజన్ టైమ్స్ మహబూబాబాద్ సెప్టెంబర్ 5

అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కామ సంజీవరావు గారి మాతృమూర్తి శ్రీమతి కామ చుక్కమ్మ నిన్న రాత్రి అనారోగ్యం తో మరణించాగా ఈరోజు వారి స్వగ్రామం అయిన సీరోలు మండలం,తాళ్ల సంకీస గ్రామంలో వారి తల్లిగారి పార్దిహ దేహంవద్ద పూలమాల తో ఘనంగా నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన కోండపల్లి రామచందర్ రావు టిడిపి పార్లమెంట్ కన్వీనర్,మరియు సుతారపు వెంకట నారాయణ టిడిపి రాష్ట్ర కార్యదర్శి,మరియు మహబూబాబాద్ మండలపరిషత్ మాజీ ఉపాద్యక్షులుఎల్దిమల్లయ్య వారి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తరఫున అండగా ఉంటామని తెలియజేయడం జరిగింది.

## దేవాలయాల పరిరక్షణకు ప్రతి హిందువు భాగస్వామి కావాలి

గొల్లనపల్లి: (సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్ :05:

దేవాలయాల పరిరక్షణ ప్రతి హిందువు బాధ్యతగా భావించాలని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం మండలం గొల్లనపల్లి గ్రామంలోని శ్రీ కార్యసిద్ధి వీరాంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానం రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేయడం శుభపరిణామమన్నారు. గత ప్రభుత్వ పాలనలో హిందూ దేవాలయాల పట్ల నిర్లక్ష్య ధోరణి కనిపించిందని విమర్శించారు. దేవుడు మనందరికంటే ఉన్నతమైనవాడనే సత్యాన్ని గుర్తించి ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. చరిత్రను పరిశీలిస్తే చక్రవర్తులు, రాజులు దేవాలయాల అభివృద్ధికి విశేష ప్రాధాన్యం ఇచ్చారని, శ్రీకృష్ణదేవరాయలు హంపీ నుంచి వచ్చి శ్రీకాకుళేశ్వరస్వామి ఆలయానికి వేల ఎకరాల భూములను దానం చేశారని గుర్తు చేశారు. నేటి కాలంలో దాతృత్వం తగ్గిపోతోందని, ప్రతి హిందువు తమకు సాధ్యమైనంత మేర ఆలయాలకు వస్త్రాలు, పంచలు వంటి కానుకలు సమర్పించే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. దేవాలయానికి వెళ్లి వందల కోరికలు కోరే భక్తులు, ఆలయ అభివృద్ధికి కూడా చేయూతనివ్వాలని అన్నారు. దేవాలయాలు నిర్మించిన దాతలను స్మరించుకోవడం కూడా భక్తి సంస్కృతిలో భాగమని చెప్పారు. సమాజంలో పాపభీతి, దైవభక్తి ఉన్నప్పుడే తప్పులు తగ్గుతాయని చరిత్ర చెబుతోందన్నారు. దేవాలయాల అభివృద్ధికి విరాళాలు అందించే దాతలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని, వారు చేసిన పుణ్యానికి దేవుడి ఆశీస్సులు తప్పక ఉంటాయని యార్లగడ్డ వెంకట్రావు అన్నారు.



# రాత్రి భోజనం ఆలస్యంగా తీసుకుంటే.. డయాబెటిస్ వస్తుందా?



చాలా మంది రాత్రి వేళ ఆలస్యంగా భోజనం తీసుకోవడాన్ని సాధారణ అలవాటుగా భావిస్తారు. కానీ ప్రభావం వెంటనే గుర్తించబడకపోయినా అది క్రమంగా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా రాత్రి ఆలస్యంగా తినడం వల్ల శరీర సమతుల్యత దెబ్బతింటుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. నేటి ఒత్తిడితో కూడిన జీవనశైలి ఆరోగ్యంలో అనేక మార్పులకు దారితీసింది. పని, మొబైల్ ఫోన్ల అధిక వినియోగం,మారుతున్న జీవనశైలి కారణంగా ఆహారపు అలవాట్లు చెదిరిపోతున్నాయి. అందువల్ల చాలామంది ఆలస్యంగా తినడం అలవాటు చేసుకున్నారు. దానిని సాధారణ అలవాటుగా భావిస్తారు. కానీ ప్రభావం వెంటనే గుర్తించబడకపోయినా అది క్రమంగా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా రాత్రి ఆలస్యంగా తినడం వల్ల శరీర సమతుల్యత దెబ్బతింటుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. కాబట్టి రాత్రి ఆలస్యంగా తినడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పెరుగుతాయా? రాత్రిపూట ఆలస్యంగా తినడం, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం మధ్య బలమైన సంబంధం ఉందని నిపుణులు చెబుతారు. భోజన సమయం చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తుందని అనేక అధ్యయనాలు సైతం నిరూపించాయి. అందుకే ఈ అలవాటు విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆర్ఎంఎల్ హాస్పిటల్‌లోని మెడిసిన్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ గిరి ప్రకారం.. ఒక వ్యక్తి ఆలస్యంగా భోజనం చేసినప్పుడు, శరీరం దానిని ప్రాసెస్ చేయడం కష్టమవుతుంది. పగటిపూట కంటే రాత్రిపూట శరీరం నెమ్మదిగా పనిచేస్తుంది. అలాంటి సందర్భంలో తినే ఆహారం వెంటనే శక్తిగా మారదు. అందువల్ల, రక్తంలో గ్లూకోజ్ స్థాయి పెరగవచ్చు. ముఖ్యంగా తీపిగా ఉండే భోజనం తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి వేగంగా పెరుగుతుంది. అధిక చక్కెర స్థాయిలు కేవలం మధుమేహ వ్యాధిగ్రస్తులకు మాత్రమే సమస్య కాదు. ఆరోగ్యకరమైన వ్యక్తికి కూడా, రాత్రి ఆలస్యంగా తినే అలవాటు భవిష్యత్తులో సమస్యలకు దారితీస్తుంది. ఎక్కువ రోజులు ఈ అలవాటు కొనసాగించడం వల్ల శరీర చక్కెర నియంత్రణ వ్యవస్థ బలహీనపడుతుంది. క్రమంగా, ఇది ఇన్సులిన్‌ను ప్రభావితం చేస్తుంది. రక్తంలో చక్కెర స్థాయి సాధారణం కంటే ఎక్కువగా పెరగడం ప్రారంభమవుతుంది. ఈ అలవాటు మధుమేహం క్రమంగా ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ సకాలంలో సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

# బట్టల్లో యూరిన్ పడిపోతుందా!



మూత్ర ఆపుకొనలేని స్థితి అనేది చాలా మందిని వేధించే సమస్య. ఓవర్‌యాక్టివ్ బ్లాడర్, స్ట్రెస్ యూరినరీ ఇంకంటినెన్స్, ఓవర్‌ఫ్లో ఇంకంటినెన్స్ వంటి వివిధ రకాలు ఉన్నాయి. డయాబెటిస్, మెనోపాజ్, బలహీనమైన కండరాలు వంటివి ప్రధాన కారణాలు. సరైన నిర్ధారణ, చికిత్సల ద్వారా ఈ సమస్యను నియంత్రించవచ్చు. మూత్ర ఆపుకొనలేని స్థితి (యూరినరీ ఇంకంటినెన్స్) అనేది చాలా మంది వృద్ధులను, ముఖ్యంగా మహిళలను, వేధించే ఒక సాధారణ ఆరోగ్య సమస్య. దీని వల్ల వ్యక్తిగత జీవితంపై తీవ్ర ప్రభావం పడుతుంది, సామాజిక కార్యకలాపాలకు దూరం కావాల్సి రావచ్చు. యూరిన్ లీకేజ్, దుర్వాసన, మూత్రం రంగులో మార్పు వంటి లక్షణాలతో బాధపడుతున్న ఒక 50 ఏళ్ల వ్యక్తి ప్రశ్నకు సమాధానంగా, వైద్యులు ఈ సమస్య గురించి కారణాలు, చికిత్సా పద్ధతులను వివరించారు. మూత్రం ఆపుకొనలేని స్థితి ప్రధాన రకాలు: 1. ఓవర్‌యాక్టివ్ బ్లాడర్: ఈ స్థితిలో బ్లాడర్ పరిమాణం చిన్నదై, తరచుగా మూత్ర విసర్జన చేయాలనే బలమైన కోరిక కలుగుతుంది. బ్లాడర్‌కు వెళ్లే లోపల కూడా మూత్రం లీక్ కావచ్చు. దీర్ఘకాలిక మధుమేహం (5-6 సంవత్సరాలకు పైగా) ఉన్నవారిలో బ్లాడర్ కండరాలు ప్రభావితమై ఈ సమస్య రావొచ్చు. అలాగే, పోస్ట్ మెనోపాజల్ తర్వాత హార్మోన్ల మార్పుల వల్ల బ్లాడర్ కండరాలు బలహీనపడి, ఇరిటబిలిటీ పెరిగి, బ్లాడర్ సామర్థ్యం తగ్గిపోవడం కూడా ఒక కారణం. దీనివల్ల తరచుగా, హఠాత్తుగా మూత్ర విసర్జన చేయాల్సి వస్తుంది. 2. స్ట్రెస్ యూరినరీ ఇంకంటినెన్స్: దగ్గినా, తుమ్మినా, నవ్వినా, లేదా ఏదైనా శారీరక శ్రమ చేసినా మూత్రం లీక్ అవ్వడం దీని లక్షణం. హార్మోన్ల క్షీణత, వయసు పెరగడం, లేదా ప్రసవాల కారణంగా గర్భసంచి చుట్టూ ఉన్న పెల్విక్ కండరాలు (పెల్విక్ ఫ్లోర్ మజిల్స్) బలహీనపడటం వల్ల ఇది సంభవిస్తుంది. కడుపుపై ఒత్తిడి పెరిగినప్పుడు ఈ బలహీన కండరాలు మూత్రాశయాన్ని సరిగా నిలువరించలేవు. 3. మిశ్రమ ఇంకంటినెన్స్: ఇది ఓవర్‌యాక్టివ్ బ్లాడర్, స్ట్రెస్ యూరినరీ ఇంకంటినెన్స్ లక్షణాల కలయిక. అంటే, దగ్గినా, తుమ్మినా మూత్రం లీక్ అవ్వడం, అలాగే మూత్రం వచ్చినప్పుడు ఆపుకోలేకపోవడం వంటి రెండు సమస్యలు ఒకేసారి ఉండవచ్చు.

4. ఓవర్‌ఫ్లో ఇంకంటినెన్స్: ఈ రకంలో, బ్లాడర్ సరిగ్గా ఖాళీ అవ్వదు. దీనివల్ల మూత్రాశయం నిండిపోయి, మూత్రం నిరంతరం చుక్కలు చుక్కలుగా లీక్ అవుతుంది. దీర్ఘకాలిక మధుమేహం ఉన్నవారిలో బ్లాడర్ పంపింగ్ సామర్థ్యం తగ్గిపోవడం, మూత్రం మిగిలిపోవడం వల్ల బ్లాడర్ పూర్తి అయ్యే సంవేదన తెలియక, అది నిండిపోయి ఓవర్‌ఫ్లో అవుతుంది. ఓవర్‌యాక్టివ్ బ్లాడర్ నిర్ధారణ: యూరోడైనమిక్ స్టడీ అనే పరీక్ష ద్వారా బ్లాడర్ ప్రెషర్‌లను, లీకేజ్ ఎప్పుడు జరుగుతుందో అంచనా వేస్తారు. దీనిలో బ్లాడర్‌లోకి చిన్న ట్యూబ్ ద్వారా నీటిని పంపి పరిశీలిస్తారు. ఓవర్‌ఫ్లో ఇంకంటినెన్స్ చికిత్స: కొన్ని రోజులు యూరిన్ పైపు (కేథెటర్) అమర్చడం, ఆపై సిఐసి (క్లీన్ ఇంటర్‌మిటెంట్ కేథెటరైజేషన్) అంటే ప్రతి నాలుగు గంటలకు ఒకసారి పైపును స్వయంగా పెట్టుకుని తీయడం వంటి శిక్షణ ఇస్తారు. బ్లాడర్ పంపింగ్‌ను మెరుగుపరచడానికి మందులు కూడా ఇస్తారు. ఈ పద్ధతుల ద్వారా లీకేజ్‌ను గణనీయంగా తగ్గించవచ్చు. స్ట్రెస్ ఇంకంటినెన్స్ చికిత్స: కీగెల్ ఎక్సర్‌సైజులు (పెల్విక్ ఫ్లోర్ ఎక్సర్‌సైజులు) కండరాలను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. అయితే, కొన్నిసార్లు ఈ వ్యాయామాలు సరిగా స్పందించకపోవచ్చు లేదా లీకేజ్ ఎక్కువగా ఉన్నప్పుడు "స్లింగ్ సర్జరీలు" అనే శస్త్రచికిత్సలు అవసరం కావచ్చు. ఈ ఆపరేషన్ల ద్వారా మూత్రం లీకేజ్‌ను పూర్తిగా నివారించవచ్చు. ఈ సమస్యతో బాధపడేవారు తక్షణమే వైద్య నిపుణులను సంప్రదించి, సరైన నిర్ధారణ, చికిత్స పొందడం ద్వారా సాధారణ జీవితాన్ని గడపవచ్చు.

# స్టెంట్ వేసిన తర్వాత కూడా గుండెపోటు వస్తుందా..?



నేటి ప్రపంచంలో, గుండె జబ్బులు, దాని చికిత్స గురించి ఇంటర్నెట్‌లో చాలా సమాచారం అందుబాటులో ఉంది. దీంతో రోగులు, వారి కుటుంబాలు తరచుగా గందరగోళానికి గురవుతారు. ముఖ్యంగా కార్డియాక్ స్టెంట్లకు సంబంధించి, ప్రశ్న పదేపదే తలెత్తుతుంది. స్టెంట్ వేసిన తర్వాత కూడా గుండెపోటు వస్తుందా? స్టెంట్ వేసిన తర్వాత కూడా గుండెపోటు వచ్చే అవకాశం పూర్తిగా తొలగించినట్లు కాదని వైద్యులు స్పష్టంగా చెబుతున్నారు. నేటి ప్రపంచంలో, గుండె జబ్బులు, దాని చికిత్స గురించి ఇంటర్నెట్‌లో చాలా సమాచారం అందుబాటులో ఉంది. దీంతో రోగులు, వారి కుటుంబాలు తరచుగా గందరగోళానికి గురవుతారు. ముఖ్యంగా కార్డియాక్ స్టెంట్లకు సంబంధించి, ప్రశ్న పదేపదే తలెత్తుతుంది. స్టెంట్ వేసిన తర్వాత కూడా గుండెపోటు వస్తుందా? స్టెంట్ వేసిన తర్వాత కూడా గుండెపోటు వచ్చే అవకాశం పూర్తిగా తొలగించినట్లు కాదని వైద్యులు స్పష్టంగా చెబుతున్నారు. గుండెకు రక్తాన్ని తీసుకువెళ్ళే ధమనులలో కొలెస్ట్రాల్ నిక్షేపాలు దారిని ఇరుకుగా చేసినప్పుడు స్టెంట్ అమరుస్తారు. ఇది సాధారణ రక్త ప్రవాహాన్ని పునరుద్ధరించడానికి, మూసుకుపోయిన సిరలోకి చొప్పించబడే లోహపు మెష్. గుండెపోటు తర్వాత లేదా తీవ్రమైన అడ్డంకులు ఉన్న సందర్భాల్లో సిరను తెరిచి ఉంచడానికి సహాయపడుతుంది. గుండెకు తగినంత రక్త ప్రసరణను నిర్ధారించడానికి సాధారణంగా స్టెంట్ అమరుస్తారు.

స్టెంట్ ఒక నిర్దిష్ట సిరను తెరుస్తుంది. కానీ అది గుండెలోని అన్ని ధమనులను రక్షించదు. రోగి అనారోగ్యకరమైన జీవనశైలిని కొనసాగిస్తే, వేయించిన, అధిక కొవ్వు పదార్థాలు తింటే, ధూమపానం చేస్తే లేదా శారీరకంగా క్రియారహితంగా ఉంటే, ఇతర గుండె ధమనులలో అడ్డంకులు ఏర్పడవచ్చు. అందుకే స్టెంట్ వేసినప్పటికీ మళ్ళీ గుండెపోటు రావచ్చు. స్టెంట్ సహజ సిరకు ప్రత్యామ్నాయం కాదు. ఆ సమయంలో ప్రాణాలను కాపాడటానికి సహాయపడే తాత్కాలిక మద్దతు మాత్రమే. శరీరంలోకి పదేపదే స్టెంట్లను చొప్పించడం సురక్షితమైనదిగా.. శాశ్వత పరిష్కారంగా పరిగణించదంటున్నారు వైద్య నిపుణులు. మళ్ళీ గుండెపోటు వస్తే, రోగి పరిస్థితి మరింత తీవ్రంగా మారవచ్చంటున్నారు. చికిత్స కూడా కష్టతరం కావచ్చు అని కార్డియాలజిస్ట్ వైద్య నిపుణులు వివరిస్తున్నారు. స్టెంట్ అమర్చిన తర్వాత, రోగి మునుపటి కంటే ఎక్కువగా దుర్బలంగా ఉంటాడు. రెండవ గుండెపోటుతో ప్రమాద తీవ్ర పెరుగుతుంది. చాలా సందర్భాలలో, యాంజియోప్లాస్టీ , స్టెంట్ చొప్పించడం అవసరం రావచ్చు. కొన్ని సందర్భాల్లో, శరీరం స్టెంట్‌ను అంగీకరించకపోతే, ప్రక్రియ సమయంలో ఏదైనా సమస్య ఉంటే, పరిస్థితి ప్రాణాంతకం కూడా కావచ్చు. అందుకే స్టెంట్ అమర్చిన తర్వాత నిర్లక్ష్యంగా ఉండకూడదని వైద్యులు పదేపదే హెచ్చరిస్తున్నారు. సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, సరైన సమయంలో వైద్యులు సూచించిన మందులు తీసుకోవాలి. ధూమపానం మానేయడం, ఒత్తిడిని నియంత్రించడం అనేవి స్టెంట్ తర్వాత గుండెను రక్షించుకోవడానికి అత్యంత ప్రభావవంతమైన మార్గాలు. స్టెంట్ అనేది చికిత్సలో ఒక భాగం, మొత్తం చికిత్స కాదు. నిజమైన చికిత్స జీవనశైలి మార్పుల నుండి వస్తుందంటున్నారు వైద్య నిపుణులు.

## టమాటాలు ఫ్రిజ్‌లో నిల్వ చేస్తే.. రోగాలు కొని తెచ్చుకున్నట్లే!



చట్నీ నుంచి సాంబార్ వరకు ప్రతి వంటకానికి టమోటాలు అవసరం. అందుకే మనం మార్కెట్ నుంచి కాస్త ఎక్కువ మొత్తంలో టమోటాలు కొని నేరుగా ఫ్రిజ్‌లో ఉంచుతాం. ఈ విధంగా రిఫ్రిజిరేటర్‌లో టమోటాలు నిల్వ చేయడం వల్ల వాటి రుచి మారడమే కాకుండా ఆరోగ్యానికి కూడా హానికరం. టమోటాలు లేకుండా వంట చేయడం ఎవరికీ సాధ్యం కాదు. చట్నీ నుంచి సాంబార్ వరకు ప్రతి వంటకానికి టమోటాలు అవసరం. అందుకే మనం మార్కెట్ నుంచి కాస్త ఎక్కువ మొత్తంలో టమోటాలు కొని నేరుగా ఫ్రిజ్‌లో ఉంచుతాం. ఈ విధంగా రిఫ్రిజిరేటర్‌లో టమోటాలు నిల్వ చేయడం వల్ల వాటి రుచి మారడమే కాకుండా ఆరోగ్యానికి కూడా హానికరం అని నిపుణులు హెచ్చరించారు.బాగా పండిన టమోటాలను ఫ్రిజ్‌లో నిల్వ చేయవచ్చు. కానీ ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం వాటిని ఐదు రోజుల కంటే ఎక్కువ నిల్వ చేయకూడదట. అతి శీతల ఉష్ణోగ్రతలు టమోటాలలో కణ నిర్మాణాన్ని దెబ్బతీస్తాయి. దీనివల్ల వాటి నాణ్యత తగ్గుతుంది. కాబట్టి మీరు వాటిని రెండు లేదా మూడు రోజుల్లో ఉపయోగించుకుంటే మంచిది. ఫ్రిజ్‌లో ఉంచవచ్చు లేదంటే వాటిని బయట గది ఉష్ణోగ్రత వద్ద ఉంచడం మంచిది. ఈ విధంగా మీరు టమోటాల పూర్తి ప్రయోజనాలను పొందవచ్చు. సాధారణంగా టమోటాలను ఒక వారం కంటే ఎక్కువ రోజులు ఫ్రిజ్‌లో ఉంచితే, అవి బయటి వైపు బాగా కనిపించవచ్చు కానీ లోపల కుళ్ళిపోవడం ప్రారంభించవచ్చు. వంటలో ఇటువంటి టమోటాలను ఉపయోగించడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. రిఫ్రిజిరేటర్‌లో అధిక తేమ వల్ల టమోటాలు మనకు తెలియకుండానే చెడిపోతాయి. ఇటువంటి టమోటాలు తినడం వల్ల అనారోగ్యం, వాంతులు, విరేచనాలు వస్తాయి. రోగనిరోధక శక్తి బలహీనపడటం, ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. మీరు టమోటాలను తాజాగా ఉంచుకోవాలనుకుంటే వాటిని కొన్న వెంటనే కొన్ని రోజుల్లోనే ఉపయోగించడానికి ప్రయత్నించండి. ఫ్రిజ్‌లో నిల్వ చేసినప్పటికీ కూరగాయల కోసం కేటాయించిన డ్రాయర్‌లో ఉంచండి. టమాట లోపల నల్లటి మచ్చలు, దుర్వాసన ఉన్న టమోటాలను ఉపయోగించవద్దు.

## అరటి పండ్లు ఈ టైంలో తింటే ఎన్నో లాభాలు



ఏడాది పొడవునా లభించే పండ్లలో అరటిపండు ఒకటి. అరటిపండ్లను పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టంగా తింటారు. అయితే అరటిపండ్లను ఎల్లప్పుడు సరైన పద్ధతిలోనే తినాలి. తద్వారా వీటిల్లోని పోషకాలను పూర్తిగా పొందొచ్చు.ఏడాది పొడవునా లభించే పండ్లలో అరటిపండు ఒకటి. అరటిపండ్లను పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టంగా తింటారు. అయితే అరటిపండ్లను ఎల్లప్పుడు సరైన పద్ధతిలోనే తినాలి. తద్వారా వీటిల్లోని పోషకాలను పూర్తిగా పొందొచ్చు. ఉదయం నిద్రలేచిన తర్వాత అరటిపండ్లు తినడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. ఇందులో ఉండే విటమిన్ బి6, పొటాషియం రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడతాయి. మలబద్ధకంతో బాధపడేవారికి ఉదయం అరటిపండ్లు తినడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. జిమ్‌కు వెళ్లే ముందు లేదా వ్యాయామం చేసే ముందు 1 లేదా 2 అరటిపండ్లు తినడం మంచిది. అరటిపండ్లలోని కార్బోహైడ్రేట్లు వ్యాయామానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. అలాగే పొటాషియం కండరాల తిమ్మిరిని నివారిస్తుంది. ఇది కండరాలను కూడా బలపరుస్తుంది. భోజనం తర్వాత అరటిపండ్లు తినడం వల్ల జీర్ణక్రియ వేగవంతం అవుతుంది. అరటిపండ్లలోని ఫైబర్ ఆహారం జీర్ణం కావడానికి దోహదపడుతుంది. ఇది పేగు ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. శరీరం నుంచి విషాన్ని బయటకు పంపడంలో కూడా సహాయపడుతుంది. సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య ఆకలిగా అనిపించినప్పుడు జంక్ ఫుడ్ కు బదులుగా అరటిపండ్లు తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇది స్నాక్స్ తినే అలవాటును వదిలించుకోవడానికి సహాయపడుతుంది. ఇది శరీరానికి అవసరమైన పోషణను కూడా అందిస్తుంది.

## టెక్నాలజీ : వాయిస్ ట్రాన్స్లేషన్తో ఒరిజినల్ వీడియోలా!

ఇన్‌స్టాగ్రామ్‌లో మరో కొత్త ఫీచర్ వచ్చేసింది. క్రియేటర్లకు ఈ ఫీచర్ చాలా బాగా ఉపయోగపడనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని వాడి రీల్స్ కంటెంట్‌ను ప్రాంతీయ భాషల్లోకి ట్రాన్స్‌లేట్ చేసకునేందుకు 'వాయిస్ ట్రాన్స్‌లేషన్ణ ఫీచర్‌ను తీసుకొచ్చింది. దీంతోపాటు 'లిప్ సింక్' టూల్ కూడా ఉంది. ఇప్పటివరకు కేవలం ఇంగ్లిష్, హిందీ వంటి భాషలకు మాత్రమే పరిమితమైన ఈ టెక్నాలజీ తెలుగు, తమిళం, కన్నడ, బెంగాలీ, మరాఠీ భాషల్లో అందుబాటులోకి వచ్చింది.అయితే, వీడియో కంటెంట్ ట్రాన్స్‌లేషన్?లా కాకుండా చాలా నేచురల్‌గా ఉంటుంది. పైగా రోబోటిక్ వాయిస్‌లా ఉండకుండా అచ్చం ఒరిజినల్‌లా అనిపిస్తుంది. గొంతులోని పిచ్, స్టైల్, ఎమోషన్స్‌కు తగ్గట్టు పసిగట్టి అలానే అనువదిస్తుంది. దీనికి లిప్ సింక్ ఫీచర్ కూడా తోడవ్వడంతో మాట్లాడే వ్యక్తి పెదవుల కదలికలను బట్టి ఏఐ ఆటోమేటిక్‌గా అనలైజ్ చేసి, ట్రాన్స్‌లేట్ చేసేటప్పుడు దానికనుగుణంగా కదలికలను మారుస్తుంది. కాబట్టి కంటెంట్‌ను ఏ భాషలో చూసినా ఒరిజినల్ వాయిస్‌లానే అనిపిస్తుంది. వాయిస్ మాత్రమే కాదు, వీడియో ఎడిటింగ్ డిపార్ట్‌మెంట్‌లో కూడా దేవనాగరి, బెంగాలీ, అస్సామీ స్క్రిప్ట్‌లలో కొత్త ఫాంట్‌లను తీసుకురావడం ద్వారా క్రియేటర్లు తమ వీడియోలకు వాళ్ల భాషలో క్యాప్షన్లు రాసుకోవచ్చు.

**లిమిట్స్ క్రాస్ చేయకుండా..**

సోషల్ మీడియాలో ఎక్కువసేపు టైం స్పెండ్ చేయడం కూడా మంచిది కాదని పిల్లల కోసం ఆల్రెడీ కొన్ని రూల్స్, రెగ్యులేషన్స్?ను తీసుకొచ్చింది యూట్యూబ్. పిల్లలను ఎక్కువసేపు సోషల్ మీడియాలో ఉండనివ్వకుండా, వాళ్ల యాక్టివిటీలు, చదువును ఎంకరేజ్ చేసేలా పేరెంటల్ కంట్రోల్? అనే ఫీచర్? తీసుకొచ్చింది. దీంతోపాటు ఇప్పుడు మరో అప్?డేట్?ను పంచుకుంది. అదేంటంటే.. పిల్లలు యూట్యూబ్ షార్ట్స్‌ను ఎంతసేపు చూడాలో టైం లిమిట్ పెట్టొచ్చు. అంతేకాదు, త్వరలోనే షార్ట్స్ ఫీడ్‌ను పూర్తిగా జీరోకి సెట్ చేసే చాన్స్ కూడా ఉందట. అవసరాన్ని బట్టి ఒకరోజు కంప్లీట్ షార్ట్స్‌ను ఆపేయడం లేదా ఎంటర్‌టైన్‌మెంట్ కోసం 60 నిమిషాల వరకు లిమిట్ పెట్టొచ్చు.

15 నిమిషాలు, అరగంట, 45 నిమిషాలు, గంట లేదా రెండు గంటలుగా షార్ట్స్? టైమ్?ని సెట్? చేసుకోవచ్చు. సూపర్‌వైజ్డ్ యూట్యూబ్ అకౌంట్‌లలో బెడ్ టైం, 'టేక్ ఎ బ్రేక్ణ రిమైండర్లను కూడా కస్టమైజ్ చేసుకోవచ్చు. దీంతోపాటు టీనేజర్లకు ఉపయోగపడేలా కంటెంట్?ను అందించడమే లక్ష్యంగా కొత్తగా క్రియేటర్ గైడ్‌ను తీసుకొచ్చింది. ఈ క్రమంలో ఖాన్ అకాడమీ, క్రాష్ కోర్స్, టెడ్-ఎడ్ లాంటి ఎడ్యుకేషనల్ వీడియోలను టీనేజర్లకు ఎక్కువగా సూచించనుంది. వీటిని యూత్ అడ్వైజరీ కమిటీ, యూసీఎల్?ఏకి చెందిన సెంటర్ ఫర్ స్కాలర్స్ అండ్ స్టోరీటెల్లర్స్‌తో కలిసి డిజైన్? చేసినట్టు తెలిపింది. అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్, బోస్టన్ చిల్డ్రెన్స్ హాస్పిటల్స్?కు చెందిన డిజిటల్ వెల్‌నెస్ ల్యాబ్‌తోపాటు అంతర్జాతీయ సంస్థల ఎక్స్‌పర్ట్స్ దీనికి సపోర్ట్ ఇచ్చారు. రాబోయే రోజుల్లో అప్‌డేటెడ్ సైన్ అప్ విధానంతో టీనేజర్లకు ఆటోమేటిక్?గా అండర్-18 ప్రొటెక్టెడ్ అకౌంట్‌లలోకి తీసుకొచ్చేలా యాప్?లోనే వెసులుబాటు కల్పించింది.

# ‘ఎపిక్’ సబ్కో సాంగ్.. విదేశాల్లో స్టూడెంట్ లైఫ్ ఇలా..

‘ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్’ నుంచి నాలుగో పాటగా ‘సబ్కో’ రిలీజ్ అయ్యింది. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న ఈ సినిమాకు ఆదిత్య హాసన్ దర్శకత్వం వహించారు. ఇప్పటివరకు వచ్చిన పాటల్లో ప్రేమకు ఎక్కువ చోటు కనిపిస్తే, ఈసారి ఫ్రెండ్స్ గ్యాంగ్ వైపు వెళ్లారు. చదువు కోసం విదేశాలకు వెళ్లిన స్టూడెంట్స్ అక్కడ ఎలా ఉంటారు, వాళ్ల రోజువారీ లైఫ్ ఎలా మారుతుంది అనే విషయాలను పాటలో చూపించారు. లండన్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ పాట సాగుతుంది. లండన్ ఐ, డబుల్ డెక్కర్ బస్సులు, అక్కడి వీధులు, బీచ్ లొకేషన్స్ హైలెట్ అయ్యాయి. కానీ కేవలం లొకేషన్స్ చూపించడంతో ఆగలేదు. పార్ట్ టైమ్ జాబ్స్ చేయడం, సూపర్ మార్కెట్‌లో సరుకులు కొనడం, రూమ్‌లో వంట చేసుకోవడం, అసైన్‌మెంట్స్‌తో కూర్చోవడం లాంటి స్టూడెంట్ లైఫ్ మూమెంట్స్ కూడా పెట్టారు. విదేశాల్లో చదివిన వాళ్లకు తెలిసిన చిన్న చిన్న విషయాలనే పాటలో ఎక్కువగా వాడారు. శ్రీ హర్ష ఇమాని రాసిన లిరిక్స్ కూడా అదే లైన్‌లో సాగుతాయి. “దేశం కాని దేశంలో” అంటూ ఇంటికి దూరంగా ఉన్న యువత పరిస్థితిని చెబుతూనే, కొత్త ఫ్రెండ్స్‌తో ఏర్పడే బంధాన్ని తీసుకొచ్చారు. అక్కడ ఎదురయ్యే కష్టాలను మాత్రమే కాకుండా, వాటి మధ్యలో వచ్చే సరదాను కూడా పాటలో కలిపారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించగా సంజిత్ హెగ్డే, సితార కృష్ణకుమార్ ఈ పాటను పాడారు. ఆనంద్, వైష్ణవి మధ్య ట్రాక్ కూడా పాటలో పూర్తిగా పక్కన పెట్టలేదు. ఫ్రెండ్స్‌తో కలిసి పబ్‌కు వెళ్లడం, బయట తిరగడం, ఒకరితో ఒకరు టైమ్ గడపడం కనిపిస్తుంది. బోర్డ్ గేమ్ ఆడే సీన్, చిన్న రొమాంటిక్ మూమెంట్స్ కూడా ఉన్నాయి. అంటే ఇది పూర్తిగా ఫ్రెండ్‌షిప్ సాంగ్ కాకుండా, వాళ్లిద్దరి రిలేషన్ కూడా అదే గ్రూప్ లైఫ్ మధ్యలో ఎలా పెరుగుతుందో చూపించేలా పెట్టారు.








‘బేబీ’ తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మళ్లీ కలిసి నటిస్తున్న సినిమా ఇదే. కానీ ఈసారి వాళ్ల మధ్య కథ పూర్తిగా వేరే సెటప్‌లో ఉంది. ఆదిత్య హాసన్ ‘90ం ఏ మిడిల్ క్లాస్ బయోపిక్’ తర్వాత చేస్తున్న ఫీచర్ ఫిల్మ్ కావడంతో, మిడిల్ క్లాస్ యువత విదేశాలకు వెళ్లాక వచ్చే మరో జీవితాన్ని ఈ కథలో తీసుకున్నాడు. ‘సబ్కో’ పాటలో ఆ భాగం ఎక్కువగా బయటపడింది.

‘ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్’ సెప్టెంబర్ 11న థియేటర్లలోకి రానుంది. రిలీజ్‌కు పది రోజుల ముందు ఈ పాటను తీసుకొచ్చారు. ప్రస్తుతం చిత్ర బృందం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని కాలేజీల్లో ప్రమోషన్స్ చేస్తోంది. ‘సబ్కో’ను కూడా స్టూడెంట్స్ మధ్య విడుదల చేశారు. ఇక సినిమా కంటెంట్ లేటెస్ట్ జనరేషన్ కు ఎంతవరకు కనెక్ట్ అవుతుందో చూడాలి.

# టీమిండియా ఫుల్ బిజీ.. 17 రోజుల్లో 4 సిరీస్‌లు.. షెడ్యూల్ చూస్తే షాకే!




ఇటీవల శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను 1--0 తేడాతో కైవసం చేసుకున్న భారత జట్టు ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటుంది. రాబోయే వారం నుంచి టీమిండియా క్రీడా చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా అత్యంత బిజీ షెడ్యూల్‌ను ఎదుర్కోబోతోంది. క్రికెట్ చరిత్రలోనే మొదటిసారిగా ఒకే క్యాలెండర్ నెలలో, కేవలం 17 రోజుల వ్యవధిలో (సెప్టెంబర్ 13 నుంచి 30 వరకు) నాలుగు వేర్వేరు అంతర్జాతీయ సిరీస్‌లలో భారత జట్టు తలపడనుంది. ఇది అభిమానులకు నాన్-స్టాప్ వినోదాన్ని పంచడంతో పాటు ఇండియన్ క్రికెట్‌లో సరికొత్త మైలురాయిగా నిలవనుంది.

**ఆఫ్ఘనిస్తాన్‌తో టీ20లు.. జపాన్‌తో చారిత్రాత్మక మ్యాచ్:**

ఈ షెడ్యూల్ సెప్టెంబర్ 13న ఆఫ్ఘనిస్తాన్‌తో ప్రారంభమయ్యే 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌తో షురూ కానుంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ క్రికెట్ స్టేడియం వేదికగా సెప్టెంబర్ 13, 15, 17 తేదీలలో ఈ పోరు కొనసాగనుంది. ఈ సిరీస్ ముగిసిన వెంటనే సెప్టెంబర్ 22వ తేదీన జపాన్ మెన్స్ జట్టుతో టీమిండియా ఏకైక టీ20 మ్యాచ్ ఆడనుంది. క్రికెట్ చరిత్రలోనే భారత జట్టు జపాన్‌తో అంతర్జాతీయ మ్యాచ్‌లో పోటీపడటం ఇదే ఫస్ట్ టైమ్ కావడం విశేషం.

**ఆసియా క్రీడల్లో స్వర్ణంపై కన్నేసిన భారత్:**

సెప్టెంబర్ 24 నుంచి ప్రారంభం కానున్న ప్రతిష్టాత్మక ఆసియా క్రీడలు (ొూంఝుఅ +ఝఎవం 2026) మెన్స్ క్రికెట్ ఈవెంట్‌లోనూ టీమిండియా తమ సత్తా చాటేందుకు రెడీ అయింది. ఈ టోర్నమెంట్‌లో సెప్టెంబర్ 24న ఆఫ్ఘనిస్తాన్-జపాన్ మ్యాచ్‌తో పోటీలు ప్రారంభం కాగా, పాయింట్ల ఆధారంగా నేరుగా అర్హత సాధించిన భారత జట్టు సెప్టెంబర్ 28వ తేదీన జరిగే క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌తో తన ఆసియా క్రీడల ప్రస్థానాన్ని ప్రారంభించనుంది.

**వెస్టిండీస్‌తో వన్డే, టీ20 ధమాకా.. సెప్టెంబర్ 27 నుంచి షురూ:**

ఈ సిరీస్‌లు ఒకవైపు కొనసాగుతుండగానే, సెప్టెంబర్ 27 నుంచి వెస్టిండీస్‌తో 3 వన్డేలు, 5 టీ20ల సుదీర్ఘ సిరీస్ స్టార్ట్ కానుంది. మొదటి వన్డే సెప్టెంబర్ 27న, రెండో వన్డే సెప్టెంబర్ 30న జరగనుండగా, ఆఖరి వన్డే అక్టోబర్ 3న షెడ్యూల్ చేయబడింది. వన్డే సిరీస్ ముగిసిన వెంటనే ఇరు జట్ల మధ్య పొట్టి ఫార్మాట్ పోరు ప్రారంభమైవనుంది. ఇలా ఒకే నెలలో నాలుగు వేర్వేరు సిరీస్‌లలో పాల్గొంటూ బీసీసీఐ (దీజజ×) సృష్టించనున్న ఈ అరుదైన రికార్డ్ క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది.

## 13 జట్లు, 163 మ్యాచ్‌లు: అక్టోబర్ 10 నుంచి ఫుట్‌బాల్ ధమాకా..

# ఇండియన్ సూపర్ లీగ్ 2026-27 షెడ్యూల్ ఇదే!



భారత ఫుట్‌బాల్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఇండియన్ సూపర్ లీగ్ 2026-27 సీజన్ ప్రారంభ తేదీలు అధికారికంగా ఖరారయ్యాయి. ఈ కొత్త సీజన్ అక్టోబర్ 10వ తేదీ నుంచి ప్రారంభమై మే 2027 వరకు సుదీర్ఘంగా 8 నెలల పాటు కొనసాగనుంది. సాంప్రదాయక హోమ్ అండ్ అవే ఫార్మాట్‌లో మొత్తం 13 జట్లు 163 మ్యాచ్‌ల్లో తలపడనున్నాయి. లీగ్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచే జట్టు షీల్డ్ విన్నర్స్ గా నిలిచి అధికారిక ఐఎస్ఎల్ ఛాంపియన్‌గా నిలవడమే కాకుండా, ఆసియా ఖండస్థాయి టోర్నీల్లో ( ఆడే అర్హత సాధిస్తుంది. అలాగే పాయింట్ల పట్టికలో టాప్-6లో నిలిచిన జట్లు ఐఎస్ఎల్ కప్ కైవసం చేసుకునేందుకు ప్లేఆఫ్స్ ఆడనున్నాయి. ఈసారి ఐఎస్ఎల్ సరికొత్త ‘క్లబ్-లెడ్ మోడల్’ విధానంలో నిర్వహించబడుతోంది. దీని ప్రకారం లీగ్‌కు సంబంధించిన కీలక నిర్ణయాలు, వ్యూహాత్మక దిశానిర్దేశాలు నేరుగా ఆయా ఫుట్‌బాల్ క్లబ్‌ల చేతిలోనే ఉంటాయి. భారతీయ ఫుట్‌బాల్ ప్రతిభను ప్రోత్సహించడం, పటిష్టమైన క్యాలెండర్‌ను రూపొందించడం, పెట్టుబడులను పెంచడం ద్వారా దేశంలో ఫుట్‌బాల్ క్రీడకు స్థిరమైన భవిష్యత్తును అందించడమే ఈ నూతన విధానం ప్రధాన లక్ష్యం.

**ఐఎఫ్ఎల్ విజేతపై క్రమశిక్షణా వేటు:**

2025-26 ఇండియన్ ఫుట్‌బాల్ లీగ్ టైటిల్ గెలుచుకుని ఐఎస్ఎల్‌కు ప్రమోషన్ సాధించిన డైమండ్ హార్బర్ ఎఫ్‌సీకి ఊహించని షాక్ తగిలింది. రూల్స్ ప్రకారం చెల్లించాల్సిన పరిపాలనా రుసుము ను గడువులోగా చెల్లించడంలో విఫలమవడంతో ఆ జట్టుపై నిర్వహణ మండలి చర్యలు తీసుకుంది. ప్రమోషన్ అండ్ రెలిగేషన్ నిబంధనల ప్రకారం ఈ సీజన్‌లో డైమండ్ హార్బర్ ఎఫ్‌సీకి ఎలాంటి పాయింట్లు కేటాయించలేదు. పాయింట్ల పట్టికలో ఆటోమేటిక్‌గా చివరి స్థానంలో నిలవనున్న ఈ జట్టు, 2027-28 సీజన్‌కు ఐఎస్ఎల్ హోదాను కోల్పోయి తిరిగి ఐఎఫ్ఎల్‌కే పరిమితం కానుంది.

**రంగంలోకి 13 జట్లు:**

ఈ రాబోయే ఐఎస్ఎల్ 2026-27 పోరులో పాల్గొనే 13 జట్ల వివరాలు ఇవే:

బెంగళూరు ఎఫ్‌సీ, చెన్నైయిన్ ఎఫ్‌సీ, ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సీ, ఎఫ్‌సీ గోవా, ఇంటర్ కాశీ ఎఫ్‌సీ

కేరళ బ్లాస్టర్స్ ఎఫ్‌సీ, మోహన్ బగాన్ సూపర్ జెయింట్, ముంబై సిటీ ఎఫ్‌సీ, నార్త్‌ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సీ

ఒడిశా ఎఫ్‌సీ, పంజాబ్ ఎఫ్‌సీ, స్పోర్టింగ్ క్లబ్ ఢిల్లీ, చర్చిల్ బ్రదర్స్ ఎఫ్‌సీ

ఈ టోర్నీలో పాల్గొంటున్న చర్చిల్ బ్రదర్స్ ఎఫ్‌సీ క్లబ్ భాగస్వామ్యం మాత్రం అధికారిక రెగ్యులేటరీ ఆమోదాలకు లోబడి ఉండనుండటం గమనార్హం. భారీ మార్పులతో ప్రారంభమవుతున్న ఈ 8 నెలల సుదీర్ఘ ఫుట్‌బాల్ పండుగ అభిమానులకు సరికొత్త అనుభూతిని అందించనుంది.

# సీఎస్కే కెప్టెన్ మారనున్నాడా? తెరపైకి మరో స్టార్ బ్యాటర్ పేరు..!



చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) కెప్టెన్సీపై ఆసక్తికర చర్చ మొదలైంది. గత మూడు సీజన్లుగా జట్టు ప్లేఆఫ్స్‌కు చేరకపోవడంతో నాయకత్వంలో మార్పు అవసరమని మాజీ భారత ఓపెనర్ సదగోపన్ రమేశ్ అభిప్రాయపడ్డారు. కెప్టెన్‌గా రుతురాజ్ గైక్వాడ్‌కు బదులుగా సంజూ శాంసన్‌ను ఎంపిక చేయాలని సూచించారు. సంజూ అద్భుతమైన టీమ్ ప్లేయర్ అని ఆయన పేర్కొన్నారు. గత మూడు ఐపీఎల్ సీజన్లలో సీఎస్కే ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయింది. దీనికి తోడు 2026 సీజన్‌లో రుతురాజ్ గైక్వాడ్ బ్యాటింగ్ ప్రదర్శనపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జట్టులో సంజూ శాంసన్ చేరడం కెప్టెన్సీ మార్పుపై ఊహాగానాలకు మరింత ఊతమిచ్చింది.

“సీఎస్కే కెప్టెన్సీ కోసం పలు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు కనిపిస్తోంది. మార్పు అవసరమా అనే అంశంపైనా ఆలోచిస్తోంది. సంజూ శాంసన్‌ను కెప్టెన్‌గా పరిగణించాలి. అతను అద్భుతమైన టీమ్ ప్లేయర్” అని సదగోపన్ రమేశ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసిన వీడియోలో పేర్కొన్నారు. ఐపీఎల్‌లో సంజూ శాంసన్ కెప్టెన్‌గా 66 మ్యాచ్‌లకు నాయకత్వం వహించారని, అందులో 33 మ్యాచ్‌ల్లో జట్టును గెలిపించారని రమేశ్ గుర్తుచేశారు. అంటే అతని విజయాల శాతం 50గా ఉందన్నారు. అతని నాయకత్వంలో రాజస్థాన్ రాయల్స్ ఒకసారి ఫైనల్‌కు చేరడంతో పాటు మరోసారి ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిందని తెలిపారు. అయితే సంజూను కెప్టెన్‌గా నియమించినంత మాత్రాన సీఎస్కే సమస్యలన్నీ పరిష్కారం కావని రమేశ్ స్పష్టం చేశారు. జట్టులో ఇంకా చాలా మార్పులు అవసరమని చెప్పారు. మరోవైపు రుతురాజ్ గైక్వాడ్ 2026 ఐపీఎల్‌లో 337 పరుగులు మాత్రమే చేశాడు. అతని బ్యాటింగ్ సగటు 28గా ఉంది. పవర్‌ప్లేలో బ్యాటింగ్ చేసిన ఆటగాళ్లలో అత్యల్ప స్ట్రైక్‌రేట్ నమోదు చేసిన వారిలో రుతురాజ్ ఉన్నాడు. కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పిస్తే బ్యాటర్‌గా మరింత స్వేచ్ఛగా ఆడే అవకాశం ఉంటుందని మాజీ భారత క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ కూడా గతంలో అభిప్రాయపడ్డారు. కెప్టెన్సీ నుంచి తప్పించడం రుతురాజ్‌కు, సీఎస్కేకి ప్రయోజనకరమేనని అన్నారు.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776